V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం

10-09-2024

సంపుటి : 01 | సంచిక : 128 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## బీజేపీ ఆఫీస్‌ను పేల్చడమే తొలి టార్గెట్..

అయోధ్యలో రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ట రోజే

కార్యాలయంపై దాడికి ఐఈడీ విఫలయత్నం

రామేశ్వరం కేఫ్ ఘటనలో

నలుగురిని నిందితులుగా పేర్కొన్న ఎన్ఐఏ

ఛార్జిషీట్ లో వెల్లడైన సంచలన విషయాలు

2







ఆ ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగు వారాల్లో

## నిర్ణయం తీసుకోండి

- లేదంటే తామే సుమోటో కేసుగా తీసుకుని విచారిస్తాం
- పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు కీలక తీర్పు
- స్పీకర్ కార్యాలయ కార్యదర్శికి ఆదేశాలు
- హైకోర్టు తీర్పుతో ఉప ఎన్నికలు తథ్యం...
- రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పుపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందన

2







మా ప్రభుత్వానికి

# రైతన్న, నేతన్న ఒక్కటే..

- గత ప్రభుత్వ బకాయిలు చెల్లించాం
- చేనేతలకు సంబంధించిన రూ.30 కోట్ల రుణాలు మాఫీ చేస్తాం
- కుల, చేతి వృత్తులకు సముచిత న్యాయం చేస్తాం
- మహిళలకు ఏడాదికి రెండు చీరలు పంపిణీ
- ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరును పెడతాం : సీఎం రేవంత్ రెడ్డి
- నేతన్న చేయూత పథకానికి రూ.290కోట్లు విడుదల
- విద్యార్థులకు స్కాలర్ షిప్ ల పంపిణీ

**విశ్వంభర, హైదరాబాద్**

నాంపల్లిలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని(ఐఐహెచ్టీ) వర్చువల్ ప్రారంభించారు.లలిత కళా తోరణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సీఎం ప్రారంభించారు.చేనేత అభయహస్తం లోగోను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కు కొండా లక్ష్మణ్ బాపూజీ నిలువ నీడ ఇచ్చారని..కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు స్థలం ఇచ్చారన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదులుకున్నారని చెప్పారు. కానీ కొంత మంది రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలు, ఉపఎన్నికలు

మిగతా2లో...

## ఏ పేరుతో పిలిచినా పలుకుతా !

- ఇవాళ ప్రజలకు కష్టం వస్తే వారి మధ్యలోనే ఉన్నా..
- తనని అరెస్టు చేసిన రోజు ప్రజలంతా నా వెంట నిలిచారు
- వారి కోసం జీవితాన్ని అంకితం చేసి పని చేస్తా
- ముంపు ప్రాంతాల్లో హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం సరఫరా
- బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటా
- మనోధైర్యం ఇవ్వాలన్నదే నా లక్ష్యం
- విజయవాడలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు

2



పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల పదవులు

## ఊడటం ఖాయం

- రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం
- కాంగ్రెస్ పార్టీకి ఇది చెంపపెట్టులాంటిది
- ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరొక పార్టీ లోకి వెళ్లటం ప్రజలను మోసం చేయటమే
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## ప్రకాశం బ్యారేజీ గేట్ల ధ్వంసం కేసులో నిందితులకు 14 రోజుల రిమాండ్

2



## క్యాన్సర్ మందులపై జీఎస్టీ తగ్గింపు

- ఆరోగ్య బీమాపై నిర్ణయం తీసుకోలేదు
- ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థలకు మినహాయింపు
- తీర్థయాత్రలకు భక్తులను తీసుకెళ్లే హెలికాప్టర్ సేవలపై పన్ను తగ్గింపు
- ప్రకటించిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

2



మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 94 | ₹ 111 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 161 | ₹ 183 |

## తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పఠాని రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి డా.కాచం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డీ. కోటేశ్వరరావు

12


## పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా అరికెపూడి గాంధీ

2



## భారత్‌లో మంకీపాక్స్ నిర్ధరణ

- క్లేడ్ -2 రకంగా గుర్తింపు
- బాధితుడి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉంది
- ఆందోళన అవసరం లేదన్న కేంద్ర ఆరోగ్యశాఖ



2

## భారత్ లో మంకీపాక్స్ నిర్ధరణ




**దిల్లీ:** భారత్ లో మంకీపాక్స్ కేసు నిర్ధరణ అయ్యింది. విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడి నమూనాలను పరీక్షించగా.. అది పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్2 రకంగా తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల ప్రకటించి అత్యయిక స్థితికి కారణమైన క్లేడ్1 కాదని.. ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. బాధితుడి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని తెలిపింది.

విదేశాల నుంచి భారత్ కు వచ్చిన ఓ యువకుడిలో మంకీపాక్స్ లక్షణాలు గుర్తించారు. దీంతో వెంటనే ఐసోలేషన్లో ఉంచి నమూనాలను లేబొరేటరీకి పంపించారు. అది మంకీపాక్స్ అని నిర్ధరణ అయ్యింది. అయితే, గతంలో భారత్లో వెలుగు చూసిన (జులై 2022 నుంచి) 30 కేసుల మాదిరిగానే ఈ కేసు ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. డబ్ల్యూహెచ్వో ఇటీవల ప్రకటించిన ఆందోళనకర క్లేడ్1 రకం కాదని స్పష్టం చేసింది.

మంకీపాక్స్ 1958లో డెన్మార్క్ తొలిసారి కోతుల్లో వెలుగు చూసింది. వీటిని పరిశోధన కోసం తెప్పించడం గమనార్హం. 1970లో మానవుల్లో తొలిసారి గుర్తించారు. 2005లో కాంగోలో వేల సంఖ్యలో ఈ కేసులు నమోదయ్యాయి. 2017 తర్వాత నైజీరియా సహా అనేక దేశాలకు వ్యాపించింది. 2022 నుంచి మళ్లీ విస్తృతంగా వ్యాప్తి చెందుతూ అనేక దేశాలకు పాకింది. 2022 నుంచి ఆగస్టు 2024 వరకు 120 దేశాల్లో వెలుగుచూడగా.. సుమారు లక్ష కేసులు నిర్ధరణ అయ్యాయి. తాజాగా కాంగోలో ఆందోళనకర స్థాయిలో ప్రాణాంతక వైరస్ వ్యాపిస్తోంది.

## ఆ ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి

**విశ్వంభర, హైదరాబాద్:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతలపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయానికి హైకోర్టు ఆదేశాలిచ్చింది. లేదంటే తామే సుమోటో కేసుగా తీసుకుని విచారిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయించిన వారిపై చట్టప్రకారం అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.


దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సైతం పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయించిన వారిపై మూడు నెలల్లో అనర్హత వేటు వేయాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయని, అయినా స్పీకర్ పట్టించుకోవట్లేదని పిటిషనర్ల తరపు న్యాయవాది వెల్లడించారు. స్పీకర్‌ను ఆదేశించే అధికారం హైకోర్టుకు లేదని, స్పీకర్ ఇండిపెండెంట్ ట్రైబ్యునల్ అని ప్రతివాదుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గత నెల విచారణను ముగించిన హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఈ మేరకు 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయ కార్యదర్శికి ఆదేశాలిస్తూ సోమవారం తీర్పు వెల్లడించింది.

### హైకోర్టు తీర్పుతో ఉప ఎన్నికలు తథ్యం...

హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పు కాంగ్రెస్ అప్రజాస్వామ్య విధానాలకు చెంప పెట్టు అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమని హరీశ్‌రావు పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా ఉందని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా శాసన సభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామని తెలిపారు.

## ఏ పేరుతో పిలిచినా పలుకుతా - సీఎం చంద్రబాబు

**విశ్వంభర, విజయవాడ:** గత ఏడాది ఇదే రోజు ఏ ఆధారం లేకుండా అక్రమ కేసులో తనని అరెస్టు చేశారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఆ రోజు ప్రజలంతా తన వెంట నిలిచారని, అంత ఆదరణ చూపిన ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసి పని చేస్తానని చెప్పారు. ఏ పేరుతో పిలిచినా పలుకుతూ వారి మధ్య ఉండి పని చేస్తానని పునరుద్ఘాటించారు. "ఇవాళ ప్రజలకు కష్టం వస్తే వారి మధ్యలోనే ఉన్నా. ఆ రోజూ.. ఈ రోజూ బస్సులోనే ఉన్నా" అని చంద్రబాబు అన్నారు.అధిక వర్షాలు, గత పాలకుల పాపాలు ఇప్పుడు శాపాలుగా మారాయని చంద్రబాబు మండిపడ్డారు. బుడమేరు నుంచి కొల్లేరుకు నీరు వెళ్లకుండా కబ్జాలు చేశారని విమర్శించారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. ముంపు ప్రాంతాల్లో హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా అహారం సరఫరా చేశామన్నారు. సర్వశక్తులు ఒడ్డి ప్రజలను కొంతవరకు ఆదుకున్నామని, వరద బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని చెప్పారు."జటిలమైన ఈ సమస్యను సమన్వయంతో పరిష్కరిస్తాం. సర్వస్వం కోల్పోయిన వారికి జతబట్టలు ఇస్తాం. ఆప్కో, ఇతర సంస్థల వద్ద వస్త్రాలు తెచ్చి పంపిణీ చేస్తాం. వైకాపా నేతలు ప్రతి రోజూ మాపై విషం చిమ్ముతున్నారు. అయినా నాకేం ఇబ్బంది లేదు. నాకు 7 లక్షల మంది వరద బాధితుల కష్టాలే కనిపిస్తున్నాయి. వరద ప్రాంతాల్లో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిని వినియోగించాం. 9 రోజుల పాటు చేసిన పనులపై సంతృప్తిగా ఉంది. వరద బాధితులకు మనోధైర్యం ఇవ్వాలన్నదే నా లక్ష్యం. వరద ప్రాంతాల్లోని ఇళ్లలోని వస్తువులన్నీ పాడైపోయాయి. అర్బన్ కంపెనీలతో మాట్లాడి నిపుణులను ఇళ్లకే పంపిస్తున్నాం." అని చంద్రబాబు అన్నారు.



# మా ప్రభుత్వానికి రైతన్న, నేతన్న ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చారన్నారు. ఆ ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి కోట్లు సంపాదించారని ఆరోపించారు. దాన్ని త్యాగమని చెప్పుకొంటున్నారని విమర్శించారు. గజ్వేల్ లో ఫాంహౌస్ లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కేసీఆర్, కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలకు తేడా గమనించాలన్నారు. ఉప ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లతో బాగుపడిందెవరో ప్రజలకు తెలుసన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తిస్తుందని చెప్పారు. తెలంగాణ కోసం పోరాడిన కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరును ఐఐహెచ్‌టీకి పెడతామని సీఎం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన జీవో విడుదల చేయాలని అధికారులను ఆదేశిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. తెలంగాణలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు పదేళ్లలో కేంద్రం చర్యలు చేపట్టలేదని సీఎం రేవంత్ గుర్తుచేశారు. తాము అధికారంలోకి రాగానే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని ప్రధాని, కేంద్రమంత్రులను కోరామని తెలిపారు.వారు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి తక్షణమే మంజూరు చేశారని చెప్పారు. నాంపల్లి తెలుగు అకాడమీలో ఐఐహెచ్టీలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. "గత ప్రభుత్వ హయాంలో చేనేతల జీవన విధానంలో మార్పులు రాలేదు. సిరిసిల్ల నేతన్నలకు బకాయిలు చెల్లించలేదు. కాంగ్రెస్ వచ్చాక వెంటనే వాటిని విడుదల చేశాం. నేత కార్మికుల కళ్లలో ఆనందం చూడాలని నేతన్న చేయూత పథకానికి రూ.290కోట్లు విడుదల చేశామన్నారు. 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. సమాఖ్య సంఘాల ఎన్నికల నిర్వహణ




విషయంలో కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కుల, చేతి వృత్తులకు సముచిత న్యాయం చేస్తాం" అని రేవంత్రెడ్డి తెలిపారు.గత ప్రభుత్వం హంగు, ఆర్భాటాలు చేసినా నేతన్నల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదని ఆత్మహత్యలు ఆగలేదని విమర్శించారు. నేతన్న ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి లేదని అన్నారు. పవర్‌లూమ్ రంగం ఉపాధి కల్పించే ఉద్దేశంతో నాణ్యత లేని బతుకమ్మ చీరలకు బదులుగా మహిళ సంఘాలకు ఏటా రెండు చీరలను పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు. మంచి డిజైన్ క్వాలిటీతో ముందుకు రావాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. ఏడాదికి దాదాపు కోటి 30లక్షల చీల ఆర్డర్ ను నేతన్నలకు ఇవ్వనున్నామని తెలిపారు. తమ ప్రభుత్వానికి రైతన్న, నేతన్న ఒక్కటేన్నన్న రేవంత్, చేనేతలకు సంబంధించిన రూ.30 కోట్ల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు.నేతన్నలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల్ని పరిష్కరించి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. చేనేతల ట్రేడ్ మార్క్ కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

తెలుగు అకాడమీలో ఐఐహెచ్టీ ప్రారంభం..

నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కర్తల కోసం నాంపల్లి తెలుగు అకాడమీలో ఐఐహెచ్టీని ప్రారంభించారు. చేనేత రంగంలో ఆవిష్కర్తల ప్రోత్సాహానికి ప్రత్యేక కోర్సులు, శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ అందించనున్నారు. ఈ కేంద్రంలో ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సుల్లో భాగంగా ఆవిష్కరణల ప్రోత్సాహానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ప్రస్తుతానికి తాత్కాలికంగా తెలుగు యూనివర్సిటీలో ఈ ఏడాది తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. స్కిల్ యూనివర్సిటీ అందుబాటులోకి వచ్చాక పూర్తిస్థాయిలో అక్కడ ఏర్పాటుచేయనున్నారు. అధునాతన పరిశోధన అవకాశాలు కల్పించనున్నారు. నేతన్న చేయూతకు సంబంధించి రూ.290 కోట్లు చెక్కును చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌కు అందజేశారు. చేనేత పొదుపు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన నామినీలకు భీమా చెక్కులు అందించారు. ఐఐటీహెచ్ విద్యార్థులకు నెలకు రూ.2,500 చొప్పున అందించే స్కాలర్‌షిప్‌లను సీఎం అందజేశారు.

## పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల పదవులు

# ఊడటం ఖాయం

### బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల విషయంలో ఎమ్మెల్యేల పదవులు ఊడటం ఖాయమని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఓ వైపు పార్టీ ఫిరాయింపుల విషయంలో కఠినమైన చట్టం తెస్తామంటూ ఎన్నికల సందర్భంగా మాటిచ్చి...ఆ తర్వాత పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీకి ఇది చెంపపెట్టులాంటి తీర్పు అని అన్నారు. మేము మొదటి నుంచి చెబుతున్నట్లుగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని అన్నారు. “పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీంకోర్టు చాలా సీరియస్ గా ఉంది. ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరొక పార్టీ లోకి వెళ్లటం నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయటమే. అదే విషయాన్ని కోర్టులు కూడా స్పష్టం చేశాయి. పార్టీ ఫిరాయింపుల విషయంలో ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఉంది. అయినప్పటికీ గౌరవ స్పీకర్ గారు సుప్రీంకోర్టు తీర్పును కూడా లెక్కచేయకపోవటం దురదృష్టకరం” అని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరేందుకు వెళ్లిన సందర్భంలో స్పీకర్ గారి దృష్టికి సుప్రీం తీర్పు అంశాన్ని తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ ప్రజాస్వామ్యాన్ని రక్షించే విషయంలో స్పీకర్ గారు పట్టించుకోకపోవటంతో న్యాయస్థానాలను ఆశ్రయించామన్నారు.

మొదటి నుంచి మేము న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందని నమ్మామని కేటీఆర్ చెప్పారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఇక తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయమని తేలిపోయిందన్నారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి గెలిచి సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ బీఫాంతో ఎంపీగా పోటీ చేయటమంటే ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ ది ఎంత లెక్కలేనితనమో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. కచ్చితంగా మిగతా ఎమ్మెల్యే విషయంలోనూ వాళ్ల పదవులు పోవటం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపాలని రేవంత్ రెడ్డి గారు అన్న మాటలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలా? లేదంటే వాళ్లను బెదిరించి, ప్రలోభాలకు గురిచేసిన ముఖ్యమంత్రిని కొట్టాలో చెప్పాలన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఏ విధంగానైతే తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేస్తున్నాడో...అదే విధంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు హామీలిచ్చి ఇప్పుడు చేతులేత్తేశాడన్నారు. రేవంత్ మాటలు నమ్మి అడ్డంగా మోసపోయిన పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను చూస్తే జాలేస్తోందని కేటీఆర్ అన్నారు.

ఇక పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీ వైఖరి పై కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఊసరవెల్లి కూడా రాహుల్ గాంధీని చూసి సిగ్గుపడుతుందన్నారు. ఓ వైపు రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. రాహుల్ గాంధీకి పార్టీ ఫిరాయింపుల విషయంలో చిత్తశుద్ధి ఉంటే వెంటనే రేవంత్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓ వైపు పార్టీ మారిన చట్ట సభ్యుల సభ్యత్వం ఆటోమేటిక్ రద్దు చేసేలా చట్టం తెస్తామంటూ హామీ ఇచ్చి మరో వైపు తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారా అంటూ రాహుల్ గాంధీ పై మండిపడ్డారు. ఇదేం ద్వంద్వ నీతో చెప్పాలని డిమాండ్ చేశారు. హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ నుంచి పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఫించన్ రాకుండా చట్టం చేయటం, కర్ణాటకలో తమ పార్టీ ఎమ్మెల్యేలను వందకోట్ల రూపాయలు ఇచ్చి బీజేపీ ఎత్తుకెళ్తుందని మొత్తుకోవటం చూస్తుంటే దొంగే, దొంగ...దొంగ అని అరిచినట్లుందన్నారు. తెలంగాణలో ఒక నీతి...ఇతర రాష్ట్రాల్లో ఒక నీతా? ఇదే విధానమో రాహుల్ గాంధీ గారు చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు చూసి దేశ ప్రజలంతా ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. ప్రజల సమస్యలు గాలికి వదిలి...పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీకి అటు న్యాయస్థానంలోనూ, ఇటు ప్రజాక్షేత్రం గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. వచ్చే ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ బుద్ధి చెబుతారన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇప్పటికైనా రేవంత్ రెడ్డి నైజం అర్థం చేసుకోవాలని సూచించారు.

## బీజేపీ ఆఫీస్‌ను పేల్చడమే తొలి టార్గెట్..




**దిల్లీ:** బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ పై బాంబు పేలుడు ఘటనపై ఎన్ఐఏ ఛార్జిషీట్లో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. నలుగురిని నిందితులుగా పేర్కొన్న ఎన్ఐఏ.. ఈ ముష్కరుల తొలి టార్గెట్ బెంగళూరులోని మల్లేశ్వరంలో ఉన్న బీజేపీ కార్యాలయాన్ని పేల్చడమేనని వెల్లడించింది. అయోధ్యలో రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం రోజే బీజేపీ కార్యాలయంపై ఐఈడీ దాడికి విఫలయత్నం చేసినట్లు తెలిపింది. ఆ తర్వాతే రామేశ్వరం కేఫ్ పేలుడుకు ప్లాన్ చేశారని తెలిపింది. బెంగళూరు ఎన్ఐఏ కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్లో ఈ అంశాలను ప్రస్తావించింది.

రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో ముస్సావిర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మథీన్ అహ్మద్ తాహా, మాజ్ మునీర్ అహ్మద్, ముజామ్మిల్ షరీఫ్లను నిందితులుగా చేర్చింది. వీరిలో షాజీబ్, తాహాలు ఐసిస్ రాడికల్స్ అని తెలిపింది. ఈ దాడుల కోసం డార్క్ వెబ్ నుంచి డౌన్లోడ్ చేసిన భారత్, బంగ్లాదేశ్ గుర్తింపు కార్డులను ఉపయోగించినట్లు గుర్తించింది. ఇప్పటికే అరెస్టయిన ఈ నలుగురూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు తెలిపింది.

బాంబు పెట్టింది అతడే..

మార్చి 1న బెంగళూరులోని ప్రఖ్యాత రామేశ్వరం కేఫ్ లో బాంబు దాడి జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. మార్చి 3న ఈ కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎన్ఐఏ.. వివిధ రాష్ట్రాల పోలీసు బలగాలు, ఇతర ఏజెన్సీల సమన్వయంతో ముమ్మరంగా దర్యాప్తు కొనసాగించింది. ఇందుకోసం పలు సాంకేతిక, క్షేత్రస్థాయి పరిశోధనలు సైతం నిర్వహించింది. షాజీబ్ అనే నిందితుడు బాంబును అమర్చాడని విచారణలో వెల్లడైందని వెల్లడించింది. కర్ణాటకలో టార్గెట్ హత్యలు, ఇతర జిహాదీ కార్యకలాపాలకు సంబంధించిన కుట్రలు 2020లో భగ్నం కావడంతో తాహాతో కలిసి షాజీబ్ పరారయ్యాడని తెలిపింది. రామేశ్వరం కేఫ్లో పేలుడు ఘటన జరిగి 42 రోజుల తర్వాత పశ్చిమ బెంగాల్లో లో దాక్కున్న ఈ నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## ప్రకాశం బ్యారేజీ గేట్ల ధ్వంసం కేసులో నిందితులకు 14 రోజుల రిమాండ్

**విశ్వంభర, విజయవాడ:** ప్రకాశం బ్యారేజీని పడవలు ఢీ కొట్టి ధ్వంసం చేసిన ఘటనలో అరెస్టు చేసిన ఇద్దరినీ పోలీసులు విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం పడవల యజమాని ఉషాద్రితోపాటు, మరో వ్యక్తి రామ్మోహన్కు 14 రోజుల రిమాండ్ విధించింది.ఈ నెల 1న ప్రకాశం బ్యారేజీ కౌంటర్ వెయిట్లను 4 పడవలు ఢీ కొట్టిన సంగతి తెలిసిందే. దీంతో 67, 69, 70 గేట్ల వద్ద సుమారు 17 టన్నుల కౌంటర్ వెయిట్లు ధ్వంసమయ్యాయి. కొట్టుకొచ్చిన బోట్ల కోసం ఇప్పటి వరకు దాని యజమానులు రాలేదు. ఘటనపై విచారణ జరపాలని ఇరిగేషన్ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.పడవలు కొట్టుకురావడంలో యజమానుల నిర్లక్ష్యం ఉందని గుర్తించిన పోలీసులు.. వాటిని దిగువకు వదలడంలో ఏదైనా కుట్రకోణం ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. 3 పడవలపై వైసీపీ రంగులు ఉండటంతో, ఆపార్టీ నేతల ప్రమేయమేమైనా ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నారు.



## క్యాన్సర్ మందులపై జీఎస్టీ తగ్గింపు

### ప్రకటించిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**దిల్లీ:** క్యాన్సర్ రోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మందుల ధరలపై జీఎస్టీని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. జీఎస్టీ కౌన్సిల్ 54వ సమావేశం సోమవారం జరిగింది. అనంతరం నిర్మలా సీతారామన్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. క్యాన్సర్ మందులతో పాటు స్నాక్స్‌పై జీఎస్టీ రేట్లను తగ్గిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థలను జీఎస్టీ నుంచి మినహాయించినట్లు తెలిపారు. వాణిజ్య ఆస్తులను అద్దెకు ఇవ్వడం రివర్స్ ఛార్జ్ మెకానిజం కిందకు తీసుకువస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. క్యాన్సర్ మందులపై జీఎస్టీని 12శాతం నుంచి 5శాతానికి తగ్గించామని..దాంతో ఖర్చును మరింత తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎంపిక చేసిన స్నాక్స్‌పై పన్నును 18శాతం నుంచి 12శాతానికి తగ్గించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించిందని చెప్పారు. ఇక ఆన్‌లైన్ గేమింగ్ ఆదాయం ఆరు నెలల్లో 412శాతం పెరిగి రూ.6,909 కోట్లకు చేరుకుందని తెలిపారు. రేట్ల హేతుబద్ధీకరణపై జీఓఎం స్టేటస్ రిపోర్టును సమర్పించాల్సి ఉందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఒకటి రియల్ ఎస్టేట్, మరొకటి రేట్ల హేతుబద్ధీకరణపై స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోల స్థితిగతులను సైతం కౌన్సిల్ సమావేశంలో ప్రదర్శించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. క్యాసినో ఆదాయం 30శాతం పెరిగిందని తెలిపారు. ఆరోగ్య బీమాపై మంత్రుల బృందం అక్టోబర్ చివరి నాటికి నివేదికను సమర్పిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆరోగ్య బీమాపై జీఎస్టీని ఎత్తివేసే నిర్ణయం తీసుకోలేదని.. నిర్ణయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేశామన్నారు. ఆరోగ్య బీమాపై రేటును అంచనా వేయడానికి జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది.

ఈ మంత్రుల బృందం అక్టోబర్ చివరి నాటికి నివేదిక అందజేస్తుందని వివరించారు. అంతేకాకుండా మతపరమైన తీర్థయాత్రల కోసం హెలికాప్టర్ సేవల నిర్వహణపై పన్నును ఐదు శాతానికి తగ్గించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ విషయాన్ని ఉత్తరాఖండ్ ఆర్థిక మంత్రి ప్రేమ్ చంద్ అగర్వాల్ సోమవారం వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేదార్‌నాథ్, బద్రీనాథ్ తదితర తీర్థయాత్రలకు భక్తులను తీసుకెళ్లే హెలికాప్టర్ సేవలపై పన్ను 18శాతం నుంచి 5శాతానికి తగ్గించారు. ఇంతకు డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా రూ.2వేల వరకు చిన్న డిజిటల్ లావాదేవీల కోసం బిల్‌డెస్క్, సీసీ ఎవెన్యూ తదితర చెల్లింపు అగ్రిగేటర్లపై (PA) 18 శాతం జీఎస్టి విధించే అంశాన్ని కౌన్సిల్ సిఫార్సు కమిటీకి సూచించిందని అగర్వాల్ చెప్పారు. ప్రస్తుతం, అగ్రిగేటర్లు రూ.2వేల కంటే తక్కువ లావాదేవీలపై జీఎస్టీ మినహాయించారు.

## పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా అరికెపూడి గాంధీ

**విశ్వంభర, హైదరాబాద్ :** పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ఎస్టిమేట్స్ కమిటీతో పాటు ప్రజా పద్దుల సంఘానికి చైర్మన్లను నియమించింది ప్రభుత్వం. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి వీ నరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ప్రజా పద్దుల సంఘం చైర్మన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య నియామకం అయ్యారు.పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి వేముల, గంగుల కమలాకర్, రావూరి ప్రకాశ్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రామ్ రావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, భాను ప్రసాద్ రావు, ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ నియామకం అయ్యారు. ఎస్టిమేట్స్ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సుధీర్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, విజయ రమణారావు, కోరం కనకయ్య, రామ్‌దాస్ మాలోత్, యశస్విని మామిడాల, రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్ రావు, సుంకరి రాజు, టీ రవీందర్ రావు, యాదవ రెడ్డి నియామకం అయ్యారు.

ప్రజా పద్దుల కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద, వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సంజీవ రెడ్డి, లక్ష్మీ కాంతా రావు, కౌసర్ మోహినోద్దీన్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, తాతా మధుసూదన్, మీర్జా రియాజుల్ హసన్ నియామకం అయ్యారు.

# నేటి సాయంత్రం 5గంటల్లోగా విధులకు హాజరుకావాలి..

## వైద్యులకు సుప్రీంకోర్టు ఆదేశం..!



**దిల్లీ:** కోల్‌కతాకు చెందిన వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసు ఘటనపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీబీఐ కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించింది. అదే సమయంలో బెంగాల్ ప్రభుత్వం సైతం రిపోర్టును సైతం కోర్టుకు సమర్పించింది. వైద్యులు విధులకు హాజరుకాకపోవడంతో 23 మంది ప్రాణాలు కోల్పోయారని బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. ఆ తర్వాత సీబీఐ కొత్త స్టేటస్ రిపోర్టును సమర్పించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం ఆదేశించింది. విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. అనంతరం విచారణ సందర్భంగా వైద్యులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. విధులకు వచ్చిన వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. అయితే, ఇంకా వైద్యులు మంగళవారం సాయంత్రం 5గంటల్లోగా విధులకు హాజరుకావాలని చెప్పింది.

నిరంతరాయంగా విధులకు గైర్హాజరయితే వారిపై క్రమ శిక్షణా చర్యలు తీసుకోవచ్చని చెప్పింది. కేసు విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆర్‌జీ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ నివాసం, ఆసుపత్రికి మధ్య దూరాన్ని సీజేఐ అడిగి తెలుసుకున్నారు. దీనికి మెహతా స్పందిస్తూ సుమారు 15 నుంచి 20 నిమిషాల ప్రయాణం ఉంటుందని చెప్పారు. వైద్యురాలు మనందరికీ కూతురులాంటిదని.. ఈ కేసులో దోషులను వీలైనంత త్వరగా శిక్షించాలని సొలిసిటర్ జనరల్ కోరారు. విచారణ సందర్భంగా అసహజ మరణ రిపోర్ట్‌ను దాఖలు చేసే సమయంపై సుప్రీంకోర్టు వివరణ కోరింది. ఈ సందర్భంగా సీసీటీవీ ఫుటేజీ, సీబీఐకి అందించిన ఆధారాలపై సైతం ధర్మాసనం వివరాలు అడిగి తెలుసుకున్నది. కోల్‌కతా ప్రభుత్వం ఇచ్చిన నమూనాలను ఎయిమ్స్, ఇతర కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలకు పంపాలని సీబీఐ నిర్ణయించిందని ఎస్‌జీ మెహతా ధర్మాసనానికి తెలిపారు. పోర్టుమార్టం నివేదికపై మరో న్యాయవాది ప్రశ్నలు లేవనెత్తారు. వెజినల్ స్వాబ్ నాలుగు డిగ్రీల సెల్సియస్ వద్ద భద్రపరచాలని.. కానీ అలా చేయలేదన్నారు.

పోస్టుమార్టం రిపోర్టులో ఎప్పుడు పోస్టుమార్టం చేశారన్న ప్రస్తావన లేదని సొలిసిటర్ జనరల్ చెప్పారు. అత్యాచారం, హత్య కేసులో మొదటి ఐదుగంటలు కీలకమని ఎస్‌జీ మెహతా పేర్కొన్నారు. ఘటన జరిగిన ఐదురోజుల తర్వాత విచారణ చేపట్టిన సీబీఐకి ఎన్నో సవాళ్లు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో దర్యాప్తుపై కొత్త స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని సీబీఐ కోర్టును ఆదేశించింది. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో మోహరించిన భద్రతా సిబ్బందికి సంబంధించిన సమస్యను ఎస్‌జీ తుషార్ మెహతా లేవనెత్తారు. సీఐఎస్ఎస్ఎఫ్‌కు చెందిన మూడు కంపెనీలకు వసతి కల్పించాలని బెంగాల్ హోంశాఖ సీనియర్ అధికారి, సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారిని ధర్మాసనం ఆదేశించింది. ఇవాళ రాత్రి 9 గంటలకు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అవసరమైన అన్ని వనరులను సమకూర్చాలని స్పష్టం చేసింది. అయితే, ఐకార్డ్ లేకుండా ఎమర్జెన్సీ వార్డులోకి ప్రవేశించేందుకు ఎవరినీ అనుమతించొద్దని ఆదేశించడంతోపాటు వైద్యుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పింది. సోషల్ మీడియా నుంచి బాధితురాలి చిత్రాలన్నింటినీ వెంటనే తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు నామకరణం

### సీఎం రేవంత్ రెడ్డికి ధన్యావాదాలు తెలియజేసిన గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు



విశ్వంభర, హైదరాబాద్ : చేనేత కార్మికుల నేతన్నకు చేయూత పథకమునకు 290 కోట్లు విడుదల చేయడం పట్ల గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు హర్షం వ్యక్తం చేసారు. చేనేత కార్మికుల ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ప్రారంభోత్సవ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి చేనేతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అలాగే చేనేత ఋణాలు మాఫీ చేస్తాం అని ప్రకటించడం చేనేత కార్మికులకు సంతోషకరమైన వార్త అని ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ కు ధన్యవాదాలు తెలిపారు. హ్యాండ్లూమ్ టెక్నాలజీ కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు నామకరణం చేయడం గొప్ప విషయము అని అన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైద్రాబాద్ పద్మశాలి సంఘం తరపున సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## విఘ్నేశ్వరుడి మండపాలను సందర్శించిన కార్పొరేటర్ బన్నాల



**విశ్వంభర, చిల్కానగర్ :** చిల్కానగర్, ఉప్పల్ డివిజన్ల పరిధిలోని చిల్కానగర్ గుట్ట, బీరప్ప గడ్డ, రాఘవేంద్ర నగర్ సాయిరాం నగర్, చిల్కానగర్ మర్రిచెట్టు ప్రాంతం, ఉప్పల్ భరత్ నగర్ లో వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన గణేషుడి మండపాలను కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా విగ్నేశ్వరుడికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూ ప్రశాంత్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి కార్పొరేటర్ గీత ప్రవీణ్ లడ్డూని బహూకరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, రామాంజనేయులు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్. రెండోసారి హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సీవీ ఆనంద్.

- విశ్వంభర, హైదరాబాద్

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేలా

# అన్ని చర్యలు తీసుకుంటున్నాం



### సీపీ సుధీర్ బాబు

**విశ్వంభర, సరూర్‌నగర్ :** గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ సోమవారం సరూర్ నగర్ చెరువును సందర్శించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వారికి దిశానిర్దేశం చేశారు. మీడియాతో సీపీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా రాచకొండ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సరూర్ నగర్ లో నిమజ్జనం కోసం 8 క్రేన్లు ఏర్పాటు చేస్తామని, జిహెచ్ఎంసి సహకారంతో బారికేడ్లు, తాగునీటి వసతి, గజ ఈతగాళ్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛిత సంఘటనలు జరగకుండా 55 సీసీటీవీలను ఏర్పాటు చేశామని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత చర్యలతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. కమిషనర్ వెంట డిసిపి ప్రవీణ్ కుమార్ ఐపిఎస్ ఇతర అధికారులు ఉన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్ల సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే మర్రి



**విశ్వంభర, మల్కాజిగిరి :** అంగన్‌వాడీ సెంటర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాల యంలో అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లి, పిల్లల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న టీచర్లు, సూపర్‌వైజర్లు అభినందనీయులని అన్నారు.టీచర్లు, సూపర్‌వైజర్ల సమస్యలు పరిష్కరిస్తామని, నెలనెల టీచర్ల సమావేశాల కోసం ప్రభుత్వ పరంగా కొత్త భవననిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 77 అంగన్‌వాడీ సెటర్లలో నీటి సదుపాయం, బాత్రూమ్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, సూపర్ వైజర్లు జమశీల, వింధ్యావాహిని, టీచర్లు మీనాక్షి, రాణి, మమత, రాజ్యలక్ష్మి, శోభారాణి, రమదేవి, విజయలక్ష్మి, సంధ్యా, భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు.

## కర్నాటక సీఎం మార్పు వ్యవహారంపై ప్రియాంక్ ఖర్గే కీలక వ్యాఖ్యలు



**బెంగళూరు:** కర్నాటక సీఎం మార్పు వ్యవహారంపై సాగుతున్న ఊహాగానాలను రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే తోసిపుచ్చారు. ప్రియాంక్ ఖర్గే సోమవారం కలబురగిలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కర్నాటక అసెంబ్లీలో విపక్ష నేత ఆర్. అశోకపై బీజేపీకి విశ్వాసం లేదని, ఈ విషయం ముందు అశోక గుర్తెరగాలని హితవు పలికారు.కాషాయ నేతలు రాజ్‌భవన్, గవర్నర్‌ను తమ పార్టీ బలోపేతం కోసం ఉపయోగించుకుంటున్నారంటే ఆ పార్టీ దయనీయ స్థితి వెల్లడవుతున్నదని ఎద్దేవా చేశారు. సిద్ధరామయ్య పదవి గురించి కలత చెందడం మాని వారు తమ కుర్చీలను కాపాడుకోవడం కోసం పనిచేస్తే మంచిదని హితవు పలికారు. కర్నాటకలో సీఎం, డిప్యూటీ సీఎం పదవులు ఖాళీగా లేవని స్పష్టం చేశారు.సీఎం సిద్ధరామయ్యను మార్చేస్తారని కాషాయ నేతలు చేస్తున్న ప్రచారం నిరాధారమని అన్నారు. కాగా, కర్నాటక సీఎం పదవిపై పలు ఊహాగానాలు వినిపిస్తున్న వేళ ఈ వ్యవహారంపై కర్నాటక బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలందరికీ సీఎం సిద్ధరామయ్యను పదవి నుంచి తొలగిస్తారని తెలుసని వ్యాఖ్యానించారు. కర్నాటక సీఎం పదవిపై పలువురు కాంగ్రెస్ నేతలు కన్నేశారని అన్నారు. కర్నాటకలో సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు.

## చెరువులు, కుంటలను పరిరక్షించాలి

### - సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్




**విశ్వంభర, కాప్రా:** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని వివిధ మండలాల చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులను ఆక్రమించి బహుళ అంతస్తులను నిర్మించిన అక్రమార్కులను వెంటనే అరెస్టు చేసి, సదరు భూములను స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సీహెచ్ దశరథ్ అధ్యక్షతన జరిగిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీపీఐ కౌన్సిల్ సమావేశానికి బాలమల్లేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను రక్షించాలని, బాధ్యులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.జిల్లా పరిధిలోని కాప్రా చెరువు, యాప్రాల్ పరిధిలోని నాగిరెడ్డి చెరువు, బండబాయి కుంట, అల్వాల్ చిన్నరాయుడు చెరువు, కుత్బుల్లాపూర్ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువు, శామీర్‌పేట్ మండలం మెడిసిటీ హాస్పిటల్, బొమ్మరాసిపేట తదితర చెరువు స్థలాలను ఆక్రమించారని తెలిపారు. చెరువులు, కుంటల ఆక్రమణలను హైడ్రా కమిషనర్ తక్షణమే పరిశీలించి వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, ఉమామహేశ్, కార్యవర్గ సభ్యులు దశరథ్, ఆర్.కృష్ణమూర్తి, ధర్మేంద్ర, రచచ కిషన్, శంకర్‌రావు, టి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


## తడిచిన దస్త్రాలపై ఫిర్యాదుకు ప్రత్యేక ఏర్పాటు: పొంగులేటి

**విశ్వంభర, హైదరాబాద్:** వరదల కారణంగా ఇల్లు కూలిన, దెబ్బతిన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. వరద పరిస్థితులపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మృతులు కుటుంబాలకు రూ.5 లక్షలతోపాటు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. తడిచిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. సర్టిఫికెట్లు, ఇతర కీలక దస్త్రాలు తడిచిన వారు ఆందోళన చెందొద్దని, అలాంటి దస్త్రాలపై ఫిర్యాదు చేసేందుకు పీఎల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఢిల్లీలో బాణాసంచాపై నిషేధం..

### కాలుష్యంతో కేజ్రీవాల్ సర్కారు కీలక నిర్ణయం..!

**దిల్లీ:** వాయు కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. జనవరి ఒకటో తేదీ వరకు బాణాసంచా తయారీ, నిల్వ, అమ్మకం, వినియోగంపై నిషేధం విధించింది. ఈ మేరకు పర్యావరణ మంత్రి గోపాల్‌రాయ్ ఆదేశాలు జారీ చేశారు. గతేడాది సైతం ప్రభుత్వం ఢిల్లీలో బాణాసంచా తయారీ, నిల్వ, అమ్మకం, వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో పటాకుల అమ్మకం, డెలివరీపై సైతం జనవరి 1, 2025 వరకు నిషేధం అమలులో ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఢిల్లీ పోలీసులు, డీపీసీసీ, రెవెన్యూ శాఖల సహకారంతో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం 21 ఫోకస్ పాయింట్ల ఆధారంగా శీతాకాల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.




## మణిపూర్‌లో డ్రోన్, క్షిపణి దాడులకు వ్యతిరేకంగా..

# విద్యార్థుల భారీ నిరసన

**ఇంఫాల్:** మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. జాతుల మధ్య పోరాటానికి డ్రోన్లు, క్షిపణులను వినియోగిస్తున్నారు. ఇటీవల జరిగిన ఈ దాడుల్లో ముగ్గురు మరణించారు. ఈ నేపథ్యంలో డ్రోన్, క్షిపణి దాడులకు వ్యతిరేకంగా విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. సోమవారం ఇంఫాల్‌లోని రాజ్‌భవన్ ఎదుట పెద్ద సంఖ్యలో బైఠాయించారు. హింసాత్మక ఘటనలు పెరుగడంతో రాష్ట్రంలో విద్యాసంస్థలను సెప్టెంబర్ 9, 10న మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. స్కూల్ యూనిఫారం ధరించిన విద్యార్థులు గవర్నర్‌ను కలిసి తమ నిరసన తెలిపేందుకు పట్టుబట్టారు.కాగా, మణిపూర్‌లో ఏడాదిన్నర కాలంగా కుకీ, మైతీ జాతుల మధ్య సంఘర్షణ కొనసాగుతున్నది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీగా మోహరించిన కేంద్ర బలగాలు శాంతిని పునరుద్ధరించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేంద్ర అదనపు బలగాలను వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు.మరోవైపు రాష్ట్ర భద్రతా సలహాదారుని తొలగించాలని, యూనిఫైడ్ కమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే డ్రోన్, తుపాకీ దాడులకు నిరసనగా శుక్రవారం ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో వేలాది మంది స్త్రీ, పురుషులు మానవ హారం ర్యాలీలో పాల్గొన్నారు.



## చైనా కమ్యూనిస్ట్ పార్టీ తో కాంగ్రెస్ ఒప్పందం బహిర్గతం చేయాలి

**రాంచీ:** కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై అస్సోం సీఎం హిమంత బిశ్వ శర్మ స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో హిమంత శర్మ సోమవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాహుల్‌పై విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ ఎప్పుడూ చైనాకు ప్రాధాన్యత ఇస్తారని మండిపడ్డారు. భారత్‌ను అణగదొక్కి చైనాను గొప్ప దేశంగా ఆయన కీర్తిస్తుంటారని దుయ్యబట్టారు.చైనాలో ప్రజాస్వామ్యం లేదని, మత స్వేచ్ఛ లేదని రాహుల్ గాంధీ ఇదే విషయం ప్రజలకు చెబుతారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా మధ్య కుదిరిన ఒప్పందాన్ని బయటపెట్టాలని హిమంత శర్మ డిమాండ్ చేశారు.

కాగా, రాహుల్ గాంధీ టెక్సాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆరెస్సెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో భారత సంతతికి చెందిన వారిని ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ భారత్ ఒకే ఆలోచనకు సంబంధించిందని ఆరెస్సెస్ భావిస్తుందని, కానీ తాము భారత్ విభిన్న ఆలోచనలకు వేదికగా భావిస్తామని చెప్పుకొచ్చారు. భారత రాజ్యాంగంపై ప్రధాని నరేంద్ర మోదీ దాడికి తెగబడుతున్నారని ప్రజలు గ్రహించడంతో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, ఆరెస్సెస్‌కు వ్యతిరేకంగా బలమైన పోరాటం జరిగిందని గుర్తుచేశారు.

# తెలంగాణ ధీర వనిత చాకలి ఐలమ్మ

ఆధిపత్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని మోస్తూ దొరలను గడీలనుంచి ఉరికించి తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని,ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత, తెలంగాణ పౌరుషాన్ని,త్యాగాన్ని,పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ.

**ధీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెను గుర్తు చేసుకుంటూ ..**

చిట్యాల ఐలమ్మ ఈ పేరు చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. కాని చాకలి ఐలమ్మ అంటే తెలియనివారు ఉండరు. ఆధిపత్యవాదంపై ఎక్కుపెట్టిన ఆయుధం ఆమె. అన్యాయాన్ని నిలదీసిన సివంగి. వివక్షపై వీరోచితంగా పోరాడిన యోధురాలు. దొరతనాన్ని ఎదిరించిన ధీరత్వం ఆమె సొంతం. భూస్వాములపై గర్జించిన వీరవనిత. ఆకలికి అతి చేరువైన చాకలి కులంలో జన్మించింది ఐలమ్మ.1895లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో ఆమె కళ్లు తెరిచింది. మల్లమ్మ, సాయిలు దంపతుల ముద్దుబిడ్డ. చిన్న, చితక కులాలు, చేతి వృత్తిదారులు అరిగోస పడుతున్న కాలమది. భూస్వాములు, పటేల్, పట్వారీల పదఘట్టనల కింద బలహీనులు నలిగి అణగారుతున్న రోజులవి. మట్టిలో పుట్టి వెట్టిలో మగ్గిన జాతి నుంచి వెలుగురేఖలాగా దూసుకొచ్చింది. చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన ఆశాదీపం. ఆనాటి సామాజిక పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉండేవి. దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీలు కనపడితేనే భయం భయంగా, బిక్కుబిక్కుమంటూ దయనీయంగా బతకాల్సిన పరిస్థితి అణగారిన వర్గాలది. శ్రామిక మహిళల మాన, ప్రాణాలకు రక్షణ ఉండేది కాదు. చిన్న వయస్సులోనే పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో పెళ్లి అయింది. ఆమెకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుటుంబం కావడంతో పూటగడవడం కష్టంగా ఉండేది. వృత్తి పని చేసినా సరైన భుక్తి కలిగేది కాదు. ఆ పరిస్థితుల్లో పాలకుర్తి పరిసరాల్లో మల్లంపల్లి దొర వద్ద రెండు ఎకరాల భూమిని ఐలమ్మ కుటుంబం కౌలుకు తీసుకొని సాగు చేసేది. ఇది పాలకుర్తి పొరుగునే ఉన్న విస్నూరు గ్రామానికి చెందిన దొర రామచంద్రారెడ్డికి కోపం తెప్పించింది.ఐలమ్మ కుటుంబం సొంతంగా భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసుకోవడం సహించలేకపోయాడు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని పెద్ద దేశ్‌ముఖ్‌లలో విస్నూరు రామచంద్రారెడ్డి ఒకరు. జనగామ తాలూకాలోని 40 గ్రామాల్లో 40వేల ఎకరాల భూమి ఉన్న దేశ్‌ముఖ్ ఆయన. విస్నూరు దొరకు నరరూప రాక్షసుడనే పేరు ఉండేది. బువ్వకు లేనోళ్లు భూమి గురించి ఆరాటపడటమంటే తలెత్తుకుని సగర్వంగా నిలబడటం కిందే లెక్క. అది దొర ఆధిపత్యానికి సవాల్ అన్నమాటే. ఐలమ్మ భర్తను, కొడుకును జైలుపాలు చేశాడు. ఐలమ్మ పొలాల్లోని పంటలను గూండాలతో కొల్లగొట్టించాలని చూశాడు. ఐలమ్మ ధీరోద్ధాతగా నిలబడి ఎదిరించింది. కొంగు నడుముకు చుట్టి కొడవలి చేతబట్టి సివంగివలే గర్జించింది. కమ్యూనిస్టు కార్యకర్తల సహాయంతో గూండాలను తరిమికొట్టింది. ఒడుపుగా పంటను ఇంటికి చేర్చింది. ఐలమ్మపై దొర అంతకంతకు కక్ష పెంచుకుని గూండాలతో దాడులు చేయించేవాడు. ఆమె మాత్రం ఆత్మ విశ్వాసాన్నే ఆయుధంగా చేసుకొని ఎదిరించేది. "నీ గడీల గడ్డి మొల్తది" అని తూటాల్లాంటి మాటలతో దొరను గడగడలాడించింది. అప్పట్లో ఆమెతోపాటు కమ్యూనిస్టు నాయకులపై పాలకుర్తి దొమ్మి కేసు పెట్టించాడు దొర. ఖూనీకోర్లతో దాడి చేయించాడు. కోర్టుకు విన్నవించుకుందామని వెళ్తుంటే భువనగిరి సమీపంలో వారిపై దాడి చేయించాడు. తీవ్రగాయాలతోనే హైదరాబాద్ వచ్చారు. ఈ సంఘటనను 'మీజాన్' ఉర్దూ, తెలుగు దినపత్రికలో సంపాదకులు అడివి బాపిరాజు ప్రముఖంగా ప్రచురించారు. విస్నూరు దొర ఆగడాలకు ఆమె కుటుంబం ఛిద్రమైంది. పోరాటంలోనే కొడుకు, భర్త ప్రాణాలు వదిలారు. అయినా వెరవలేదు. అగ్నికణం వలె నిత్యం ఉద్యమనెగళ్లను కాపాడేది. భూ పోరాటాలకు దారి చూపి నైజాం రాజ్యం పతనానికి పునాదులు వేసిన వీరనారి చాకలి ఐలమ్మ.

ఆమె వర్ధంతి సందర్భంగా ఆమెకి ఘన నివాళులు.






- ఆలేటి రమేష్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
రజక విద్యార్థి సంఘం.
9948798982



# పామరుడికి చేరువైన పద్యం

1990 తర్వాత ప్రపంచీకరణ ఫలితంగా సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా భారత వ్యవసాయ రంగంపై నాయకుల శీతకన్ను ఫలితంగా భారత రైతు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాడు. పల్లెల్లో వృత్తులు ధ్వంసం అయ్యాయి. ఫలితంగా గ్రామీణ భారతం ఊహించని కుదుపులకు లోనైంది. అది 2000 సంవత్సరం తర్వాత పల్లెలను మరింత సంక్షుభిత వాతావరణంలోకి నెట్టింది. సామాజిక స్పృహ ఉన్న రచయితలు అందరూ ఈ పరిస్థితులను తమ రచనల్లో ఒడిసిపట్టారు. అట్లా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి కలం నుండి మట్టి పాట రావడం ఆశ్చర్యం ఏమి కాదు. ఈ సంక్షోభ సమయాన్ని చిత్రిస్తూ గోరేటి వెంకన్న పల్లె కన్నీరు పెడుతుందో అంటూ రాసిన పాట ప్రభుత్వాలను సైతం కూలదోసిందనడం అతిశయోక్తి కాదు. సరిగ్గా ఆ కోవలోనిదే ఈ మట్టి పాట కూడా. మట్టి పాట నిండా పల్లె జీవన చిత్రణ ఉంది. దుఃఖం ఉంది. ఆ దుఃఖానికి గల కారణాల అన్వేషణ ఉంది. అందుకే అది పుస్తకంగా రాకమునుపే ప్రజల నాలుకల పైన నర్తించింది. క్యాసెట్లుగా మారి జనాబాహుళ్యంలోకి వెళ్ళింది.




అప్పులోళ్లు పైసలడిగితే ఎట్లంచు /పొట్టకూటి గింజలెట్టులనుచు /వెరచి రైతుబిడ్డ ఉరికొయ్యకూగెరా/పల్లె బతుకు మాది పాడుగాను...

రైతులకు ఆత్మాభిమానం మెండు.ప్రాణం కంటే కూడా మాటకే విలువ ఇస్తారు. అట్లాంటి రైతు చేసిన అప్పు తీర్చలేక కనీసం తిండి గింజలు కూడా పండించుకోలేని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్న ఆవేదన మట్టి పాటలో కనిపిస్తుంది. పంట పెరిగినప్పుడు రైతు ఆనందానికి అవధులు ఉండవు. కానీ చేతికి వచ్చేవరకు నమ్మకం ఉండదు. వేరుశనగ జోరుగా పండిందని ఆనందించే రైతుకు అగ్గి తెగులు తగిలినప్పుడు ఎదురైన నిరాశను, దొంగలు పడి ఊరు దోచుకున్నట్లు గాలి వాన వల్ల నాశనమైన పంట వల్ల రైతుకు కంటనీరే మిగిలిందని రైతు బాధలను ఈ మట్టి పాటలో ఏకరువు పెట్టారు. ధనవంతులకు దొరికినంత తేలికగా బ్యాంకు రుణం పేదలకు అందదు. అంజుమాను బ్యాంకు అప్పులు ఇస్తామని చెప్పులు అడిగేలా తిరిగినా అప్పు పుట్టకపోయిన వైనం రైతుల ధీన స్థితికి దర్పణంగా తెలుపుతారు.

కవి ఈ మట్టి పాటకు ఎంచుకున్న మకుటంలో ఒక నిరసన కనిపిస్తుంది వ్యంగ్యం కనిపిస్తుంది. తమ బతుకుల పట్ల తమకే ఒక చీదరింపు కలిగే అంతటి దుర్భరమైన పరిస్థితులు ఉన్నాయని పల్లె బతుకు మాది పాడుగాను అనే మకుటం చెప్పకనే చెప్తున్నది.

పల్లెల్లో పంటలు పండక ఊరు విడిచి వలస బాట పడుతున్న దుస్థితిని ఈ కవి కళ్ళకు కట్టారు.

ఉన్న ఊరు నిడిసి కన్నతల్లి నిడిసి /పంట చేలనిడిసి పసుల నిడిచి/ బోరు బండ్ల మీద ఘోరంగ తిరిగేము...
ఒయ్యు పోర్ల నోట బొంబాయి మాట రా...
పరుగు తీయవలయు పట్నాల దిశకేసి..

నేటికీ ఈ పరిస్థితి తెలంగాణ పల్లెల్లో కనిపిస్తూనే ఉంది. ఆయుకట్టు లేని అనేక గ్రామాల యువకులు వ్యవసాయ యోగ్యం కాని భూములతో బతకడం కష్టమని బొంబాయి దుబాయ్ లాంటి ప్రాంతాలకు వలస పోతుండడం నేటికీ గమనిస్తున్నాం.

ఒకప్పుడు స్వయం సమృద్ధిగా ఎదిగిన పల్లె నేడు పరాన్న జీవిగా మిగలవలసిన దుస్థితి నెలకొన్నది. దానికి కారణం సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచ బ్యాంకు పడగ నీడ...

విశ్వవిపణి మీద వింతైన పెత్తనం / పడమటోనికెట్ల పట్టు బడియె / తరచ అమెరికనుల కురచ బుద్ధెరుకౌను...
ప్రపంచ బ్యాంకు బాకు పల్లె బొండిగ తెంచె.. వంటి కవిత్వ పాదాలు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న కుట్రలను బయట పెడతాయి. బహుళ జాతి కంపెనీలు కులవృత్తులను విధ్వంసం చేశాయి అనడానికి అనేక ఉదాహరణలు ఈ మట్టి పాటలో కనిపిస్తాయి.

బర్మ పట్టుదేది? బంగారు పనులేవి?/ తిత్తి కొలిమినేత తీరులేవి?/ బహుళ జాతి మాయ బలి తీసుకొని పాయె..
పద్మశాలి బతుకు బహు దుర్భరంబాయె
రాత బాగాలేదు గీత పనికి
కుండలొల్ల రైరి కూలిపాయెను సారె
కమ్మరోళ్ల పనులు కాటగలిసె

మొదలైన పద్యాలు వృత్తుల ధ్వంసాన్ని విప్పి చెప్పాయి.

పల్లెజనుల సంస్కృతిని మట్టి పాటలు అందంగా ఆవిష్కరించారు. రైతు దైనందిన జీవితం బ్రాహ్మీ ముహూర్తంలో మొదలవుతుంది. లేవగానే పశువుల దగ్గర పెండకల్లు తీయడంతో ప్రారంభమై రోజంతా శ్రమతోనే గడుస్తుంది.

శ్రమను చేయు వాడు కుమిలి ఏడ్చుట ఏమి...
కష్టమోర్చు వాన్కి కాసు లేదు అంటూ శ్రమకు తగ్గ ఫలితం దొరకడం లేదని పల్లె జనుల దుస్థితిని వివరించారు.

పాచి ముఖాన వేసుకున్న పళ్ల పుల్ల ను కూడా ఈ కవి మట్టిపాటలో వదలలేదు. ఇది వారి సూక్ష్మ పరిశీలనకు, గ్రామీణ జీవితంతో ఉన్న అనుబంధానికి నిదర్శనం.

పార్టీలు మారినా ప్రభుత్వాలు మారినా పల్లెల బతుకులు మాత్రం మారడం లేదని ఈ కవి ఆవేదన వ్యక్తం చేస్తారు

కాంగిరేసు వాళ్లు కమ్నిస్టు పార్టోళ్ళు / తెలుగు దేశమోళ్ళు జనత దళము / ఎవరు వస్తె మాత్రమేముంది లాభమ్ము...
ఓట్ల బిచ్చగాళ్లు ఒచ్చారు పోయారు / ఓట్ల కొరకు వంద నోట్ల నిచ్చి / అడుగుపెట్టరింక ఐదేళ్ల వరకును..
రామరావు గెలిచె రాజీవు గెలిచెను / ఎన్నుకున్న మనల నెవడు కనడు..
ఏలినోళ్ల మాటలు ఎంతగానో తీపి / చేత లేమొ సున్న చేయరేమి...
మంత్రిగారు రాగ మంచి రోడ్డొచ్చింది / మరు నిమిషము నందు మాయమాయే/ గౌరుమెంటు పనులు గంటకే చెడిపోవు...
కార్యకర్తకెపుడు కష్టాలె మిగిలేను/నాయకులకు సుఖము పాయదెపుడు / పార్టి లేవి అయిన పరమార్థమింతేను ...

వంటి పద్యాల ద్వారా దుష్ట రాజకీయాన్ని ఎండగట్టారు. అందుకే పల్లెవాడు ఢిల్లీని ఏలాలని ఆకాంక్షించాడు.

గ్రామీణ ప్రాంతాల్లో కులమతాతీతమైన ప్రేమలు కనిపిస్తాయి. ఇటీవల కాలంలో కులం పేరా మతం పేరా విధ్వంసం సృష్టించే కుట్రలు జరుగుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ కులమతములు వచ్చి కూడు వెట్టునె మాకు... అంటూ ప్రశ్నించారు. మాలవాడు మాకు పాలివాడు అనే నరసింహారెడ్డి కవిత్వ పాదం చూసినప్పుడు 'మంచి అన్నది మాల అయితే మాలనే అవుదున్...' అనే గురజాడ వారి మాటలు స్ఫూర్తిస్తాయి.

స్త్రీలను వేధించే సంస్కృతి, ఈవ్ టీజింగ్ సంస్కృతి పల్లెల్లో కనిపించదు. నగర సంస్కృతి పల్లెల్లోకి జొరబడిన తర్వాతనే స్త్రీలకు రక్షణ కరువైందని విశ్లేషించారు

కొసరు మాట లేదు కొంటె చూపును లేదు / పల్లె పడతికెపుడు పరద లేదు / చదివినోల్లె పరద చాటు సృష్టించారు...

అని స్పష్టం చేశారు.ఆడబిడ్డల పెళ్లిళ్లు చేయడం గ్రామీణులకు తీరని భారం అవుతోంది. అందంగా లేదని ఒకడు, కట్నకానుకలని మరొకడు పెట్టే ఇబ్బందులను మట్టి పాటలో చర్చించారు. స్త్రీ కేవలం ఇంటి పనులే కాక అటు పొలం పనులు కూడా చేస్తున్నప్పటికీ ఆడబిడ్డ బతుకు అధ్వాన్నమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా కవులు పల్లె పడుచుల అందచందాలను వర్ణిస్తారు కానీ వారి అందెల రవళుల కంటే ఆకలితో కడుపులో పేగులు చేసే శబ్దాలను ఏనుగు నరసింహారెడ్డి గారు వినగలిగారు. నాతి అరటి ఆకు నలువైపులా ముళ్ళు.. అంటూ స్త్రీకి నలువైపుల నుంచి వచ్చే ఇక్కట్లను చూడగలిగారు.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటిన నేటికీ గ్రామీణ విద్యా వ్యవస్థలో కనీస సౌకర్యాలు కొరవడటం పట్ల ఈ కవి విచారం వ్యక్తం చేస్తారు.

పాఠశాల లేదు పంతులమ్మా రాదు/వృక్షమొకటి యున్న విద్య సున్న/ మంచి ర్యాంకు లేల మా బాలలకు వచ్చు?

అని నిలదీస్తారు. కాసులిచ్చి చదువు కాన్వెంట్ లొ మీకు / ధర్మ విద్య మాకు ధనము లేక అంటూ చదువులో పేదలకు ధనవంతులకు సమానమైన విద్య అందడం లేదని తెలియజేస్తారు. వ్యవసాయ పనుల వల్ల పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు వెళ్లలేకపోతున్నారని అందువల్లే పల్లెల్లో విద్య వెనుకబాటు కనిపిస్తుందని విశదీకరించారు.ఇంగ్లీషు రాదని పల్లె విద్యార్థులను ఊరి మొహం అంటూ వెక్కిరించే వారిని నిరసించారు. బ్రతుకుతెరువు లేని చదువులు వృధా అని తేల్చి చెప్పారు.

ఈ పద్యాల్లో అందమైన రూపకాలంకారాలు అందంగా ఒదిగిపోయాయి. నగర కన్నె వన్నె నానాడు పెరిగెరా... నగరం అనే యువతీ అందచందాలు రోజురోజుకు విస్తృతం అవుతున్నాయి అంటారు. ప్రపంచ బ్యాంకు అనెడి బాకు పల్లె బొండిగలో దిగింది అంటారు.

పరిగె ఏరుకొని అంగట్లో బట్టలు కొనుకున్న మురిపెం, గోపలాయపల్లి జాతరకు వెళ్లిన జ్ఞాపకం, గంగ రేగుకాయలు, జిట్టీత పండ్లు ఏరుకున్న జ్ఞాపకం, చిలకకొట్టిన జామపండ్లు సీతాఫలాల కోసం గుట్టలు తిరగడం మొదలైన బాల్యస్మృతులను నెమరు వేసుకోవడం పల్లెపై ఈ కవికి గల మమకారాన్ని తెలియజేస్తున్నది. చిర్రగోనెలు సీసం గోలీలు కోతి కొమ్మలు ఈతలు మొదలైన బాల్య క్రీడలు మొదలైన ఆటలను టీవీ మింగేసిందని, బుల్లితెరలు పల్లెలను వంచిస్తున్నాయని బతుకునుండి రాని బద్మాష్ సీరియల్స్ గురించి బాధపడతారు.

1992లో కరసేవ పేరుతో బాబ్రీ మసీదును కూల్చిన సన్నివేశాన్ని తెలుపుతూ రాముడు ఎన్నడూ రణములను కోరలేదని తన శాంతి కాముకతను ప్రకటించారు.

ఈ పద్యాలు రాసి సుమారు మూడు దశాబ్దాల కాలం గడిచినా ప్రాసంగికత మాత్రం కోల్పోలేదు.. పైగా పల్లె ఈ కవి పేర్కొన్న సమస్యలతో పాటు మరికొన్ని సమస్యలను కూడా నేడు ఎదుర్కొంటున్నది. యువత నిర్వీర్యం అవుతున్నారు. సెల్ఫోన్ విప్లవం గ్రామాల్లో మంచి కంటే చెడుకే ఎక్కువగా దారి తీస్తున్నది... ఇట్లాంటి అనేక సమస్యలు ఏనుగు నరసింహారెడ్డి గారి దృష్టి పథాన్ని దాటిపోలేదు అనే అనుకుంటున్నాను. మూడు దశాబ్దాల అవగాహన విస్తృతి అనంతరం దీనికి కొనసాగింపుగా మరొక మట్టి పాట శతకం వీరి కలం నుండి వస్తుందని ఆశిస్తున్నాను.



- డాక్టర్ సాగర్ల సత్తయ్య
7989117415

# బాలల వికాస తరంగిణి తురగా జానకీరాణి



పిల్లలారా రారండోయ్...బాల బాలికలు రారండోయ్... బాలల ప్రోగ్రాం విన రారండోయ్... అంటూ ప్రారంభమై, పాటతో మొదలై... 'పోదామా ఇక పోదామా ఇళ్లకు... మన ఇళ్లకు...అనే ముగింపుతో వినిపించే రేడియోలో ప్రసారమయ్యే బాలానందం కార్యక్రమం కోసం పిల్లలే కాదు...పెద్దలు సైతం ఉత్సాహంతో ఎదిరి చూసిన పాత జ్ఞాపకాలు అయిదు పదుల వయసు దాటిన వారికి చెరిగిపోని జ్ఞాపకాలే. రేడియో అక్కయ్యగా తురగా జానకీరాణి, ఆకాశవాణి ద్వారా నిర్వహించిన పిల్లల కార్యక్రమాలు మరిచి పోలేనివి.

ఎందరో చిన్నారులు బాలా నందంలో పాల్గొనే అవకాశం పొంది, తమ కంఠం వినిపించ డం వెనుక ఆమె పాత్ర మరిచి పోలేనిది. పాటలు, నాటికలు, రూపకాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రూపొందించి వాటిలో చిన్నారులతో ప్రదర్శింప చేసిన ఆమె కృషి మరిచి పోనిది. ఎందరో ప్రముఖులు తమకు చిన్నతనంలో ఆకాశవాణిలో రేడియో అక్కయ్యతో వున్న అనుభవం మర్చిపోకుండా ఉంటారు.

తురగా జనకీరాణి ఆగష్టు 31, 1936లో జన్మించారు. ఆలిండియా రేడియోలో నేటికీ రేడియో అక్కయ్యగా సుపరిచి తురాలు అయిన ఆమె రచయిత్రి, సంఘ సంస్కర్త ..ఆకాశవాణి ఉద్యోగంలో చేరక ముందు రేడియో ఆర్టిస్టుగా , రాత్రి 7 నుండి 7.50 వరకు కథానికా పఠనం చేసే వారు. ఆకాశవాణిలో ఆమె అనేక కొత్త ప్రయోగాలు చేశారు. చొప్పదంటు ప్రశ్నలు, బాలవాణి వంటి కార్యక్రమాలు, కంగారు మామయ్య, కొంటె కృష్ణయ్య, వెర్రి వెంగళప్ప వంటి పాత్రలు ప్రవేశపెట్టి చిన్నారి శ్రోతలకు చేరువ అయ్యారు. వందకి పైగా కథలు రచించారు. అవి మూడు సంపుటాలుగా వెలువ డ్డాయి. మూడు నవలలు, ఐదు బాలసాహిత్యం మీద పుస్తకాలు వచ్చాయి అనువాద రచనలు కూడా మూడు వచ్చాయి. పలు పత్రికల్లో వీరు రచించిన కథలు ప్రచురించ బడ్డాయి. సన్మానం, మంచిమనస్సు, ఉపాయం, వాదన, ఆడపిల్ల వంటి కథలతో కూడిన 'మిఠాయి పొట్లం 'కథల సంపుటి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'పబ్లికేషన్స్ డివిజన్' ప్రచురిం చింది. మరో కథల సంపుటి 'బంగారు పిలక 'ని నేషనల్ బుక్ ట్రస్టు వారు ప్రచురిం చారు. రెడ్ క్రాస్ కథను అనువదించారు.

ఆకాశ వాణి ద్వారా..."ఇది నా సమస్య" అని స్త్రీల కార్యక్రమం ప్రసారం చేసి స్త్రీలు తమ సమస్యలు ఉత్తరాల ద్వారా తెలియ పరిస్తే వాటి పరిష్కా రాలు నిపుణులైన డాక్టర్లు, లాయర్లు మొదలైన వారిచే చెప్పే కార్యక్రమాల, వృద్ధుల కోసం తమ జీవితానుభవాలు తెలిపే "స్రవంతి" అనే కార్యక్రమం వెనుక జానకీ రాణి కృషి అభినందనీయం.

దృశ్యశ్రవణ విధానంతో విజ్ఞానం అందించవచ్చని అమ్మపాప, చిలుక పలుకులు, ఉదయబాల, అమ్మా నేను బడికి పోతా, బంగారు పాప వంటి పలు సిడిలను రూపొందించారు. జానకీరాణి సేవలకు గుర్తింపుగా 'సనాతన ధర్మ ', బాలసాహిత్య పరిషత్ ' వంటి పలు సంస్థలు సత్కరించాయి. ఆమె 1991,1992లో వరుసగా రెండు సార్లు నేషనల్ బెస్ట్ బ్రాడ్ క్యాస్టరుగా అవార్డు పొందారు.

ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఎందరో పేరెన్నిక గల వారితో పని చేశారు .అక్కినేని నాగేశ్వర రావు, ఎస్.పి. బాలసుబ్రహ్మ మణ్యం, జె.వి. సోమయాజులు, మంజు భార్గవి, దేవుల పల్లి కృష్ణశాస్త్రి, స్థానం నరసింహారావు, వేలూరి శివానంద, గోపీచంద్.... ఇలా ఎందరితోనో కలిసి కార్యక్ర మాలు రూపొందించారు.

యూనిసెఫ్ లో, ఎన్.సి.ఆర్.టి., ప్రభుత్వ శాఖల కోసం పని చేసేటప్పుడు బాల జాగృతి (బా జా)అనే కార్యక్రమం చేపట్టి 670 వీధి ప్రదర్శనలు చేశారు. బాలల హక్కులు, సమస్యలు, బాల కార్మిక నిర్మూలన, ఇత్యాది ఎన్నో విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేవాళ్ళు. సామాజిక స్పృహ వున్న విషయాలు, సృజనాత్మక సందేశాలు పిల్లలు, యువతీ యువకులు శిక్షణ పొంది ప్రదర్శించేవాళ్లు. జానకీరాణి... 2011లో బాల సాహిత్య పరిషత్ ద్వారా "బాలసాహిత్య రత్న" అవార్డు, గహలక్ష్మి స్వర్ణకంకణం, రెండు సార్లు తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారం, రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కారం, పింగళి వెంకయ్య స్మారక సత్కారం, అరవిందమ్మ మాతృమూర్తి అవార్డు, సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారం, ఆంధ్ర సారస్వత పరిషత్తులో పరిణిత వాణి గౌరవం, 'ఈనాడు' అవార్డు, బాలబంధు, దక్షిణ మధ్య రైల్వే గౌరవ సత్కారం... ఎలా ఎన్నో పురస్కారాలను అందు కున్నారు. కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధ పడుతూ, అక్టోబరు 15, 2014న ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అధికారులు వరద పరిస్థితులను పర్యవేక్షణ చేయాలి

**విశ్వంభర, భూపాలపల్లి** :ప్రభుత్వ యంత్రాంగం లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ వరద పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం నుండి మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఇరిగేషన్ అధికారులతో భారీ వర్షాలు, వరద సహాయక చర్యలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం వరద సహాయక చర్యలను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గడిచిన కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ఎలాంటి సంఘటనలు జరుగకుండా పటిష్ఠ పర్యవేక్షణ చేసారని అభినందిస్తూ వర్షాలు పూర్తిగా తగ్గే వరకు చర్యలు కొనసాగించాలని అన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి మురుగునీటి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేయాలని మున్సిపల్, పంచాయతి అధికారులను ఆదేశించారు. కాళేశ్వరానికి ఎగువ నుండి వరద వచ్చే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. వర్షాలకు చెరువులు అలుగులు పోస్తున్నాయని చెరువులు పటిష్ఠతకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని మండలాల మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



# పూజలో పాల్గొన్న మారం జగదీష్

**విశ్వంభరా, హైదరాబాద్:** గచ్చిబౌలిలోని భాగ్యనగర్ టీఎన్జీవో మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవ మహోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్ , పి ఎన్ జి ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలం దరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అసోసి యేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భాగ్యనగర్ టీఎన్జీవో గచ్చి బౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు" డా" ముత్యాల సత్యనారాయణ గౌడ్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, రవిప్రకాష్, శ్రీకాంత్, జ్ఞానేశ్వర్, మల్లారెడ్డి , సంఘాల నాయకుడు తదితరులు పాల్గొన్నారు.




## నిజాం వ్యతిరేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న కాళోజి

**విశ్వంభర, భూపాలపల్లి :** కాళోజి సాహిత్యం తెలంగాణ సమాజాన్ని ప్రభావితం చేశాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కాళోజి జయంతిని పురస్కరించుకుని సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కాళోజి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయులు త్యాగనిరతి నేటి తరాలకు తెలియాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధికారికంగా నిర్భహించుటకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కాళోజి సామాన్య నిరాడంబర జీవితం గడిపారని అన్నారు. గుర్తింపు కావాలని ఏనాడు ఆయన కోరుకోలేదని, జీవితకాలం ఆత్మగౌరవంతో బతికారని, అన్యాయాన్ని ఎదిరించి నిజాం వ్యతిరేక పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ సేన పదోవ ఆవిర్భావ దినోత్సవం

**విశ్వంభర, కడ్తాల్:** మండల కేంద్రంలోని గిరిజన భవన్ వద్ద సేవాలాల్ సేన 10 వ వార్షికోత్సవం సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్ ఆధ్వర్యంలో, రంగారెడ్డి జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు వాంకడావత్ నరేష్ నాయక్ అధ్యక్షతన చేపట్టి లక్పతి నాయక్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా చేయాలని గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టా పాస్ బుక్కులు అందజేయాలని అన్నారు. తండాలలో పల్లె దావఖానాలు ఏర్పాటు చేసి తండాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రఘురాం రాథోడ్, సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు భీంలాల్ పవార్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమాన్ నాయక్, డిసిసి ప్రధాన కార్యదర్శి భీఖ్యా నాయక్, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పత్యా నాయక్, మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

### ఎలికట్ట చౌరస్తాలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైకిస్టులు

**విశ్వంభర, షాద్ నగర్:** పట్టణ ఎస్ఐ బలరాం తెలిపిన వివరాల ప్రకారం కొందుర్గు మండలం రేగడి చిలకమర్రి గ్రామానికి చెందిన చాకలి కరుణాకర్, శేఖర్ రెడ్డి TS 07 FJ 8012 నెంబర్ గల గ్లామర్ బైక్ పై షాద్ నగర్ నుండి తమ సొంత గ్రామమైన రేగడి చిలకమర్రికి వెళుతుండగా మార్గమధ్యంలో గల ఎలికట్ల చౌరస్తా సమీపంలో ఆగి ఉన్న AP 29 V 4519 నెంబర్ గల లారీని ఢీకొట్టగా తలకు బలమైన గాయాలు అవడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షాద్ నగర్ పట్టణ ఎస్ఐ బలరాం తెలిపారు.



## చెరువు కట్టకు ప్రమాదం ఏమీ లేదు

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ మండల కేంద్రంలోని సురసముద్రం చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండి రెండు రోజులుగా అలుగు పారుతుంది. నిండుకుండలా మారిన చెరువు కట్ట ప్రమాద భరితంగా మారడంతో షాద్నగర్ ఏసిపి. సిహెచ్, ఎన్. రంగస్వామి ఆధ్వర్యంలో స్థానిక సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై వెంకటేష్ , మున్సిపల్ కమిషనర్ వసంత తో కలిసి చెరువు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ సి పి మాట్లాడుతూ చెరువు కట్ట పటిష్టంగానే ఉందని స్థానికులు ఎవరు భయపడవద్దని కాకపోతే కొంత కుంగిన మాట వాస్తవమే అయినా దానికి ఏఈ, డి ఈ లతో కలిసి ఇసుక బస్తాలు మట్టితో మరమ్మత్తులు చేశారని ఇప్పుడు ఇంకా భారీ వర్షాలు పడితే చెప్పలేం కానీ ఇప్పటికైతే ఎటువంటి ప్రమాదం లేదని అన్నారు. కట్ట మైసమ్మ దేవాలయం వెనుక నుండి వచ్చి నిమజ్జనం చేసుకోవాలని గణేష్ ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ నాగరాజు ఏఈ తిరుపతి ఆర్ ఐ చెన్నకేశవ కట్ట మైసమ్మ ఆలయ అధ్యక్షుడు ముక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, గోల్డ్ స్మిత్ సత్యనారాయణ, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మత్స్యకార సంఘం చైర్మన్‌ను కలిసిన ముదిరాజులు

**విశ్వంభర, షాద్‌నగర్:** మత్స్యకారులకు ఆర్థికంగా ఎదిగేందుకు నాణ్యమైన చేప పిల్లలను అందించాలని తెలంగాణ మత్స సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్ ను షాద్ నగర్ ముదిరాజ్ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూలమాలలతో సత్కరించారు. అనంతరం కాసేపు వారితో ముచ్చటించారు. చేపల పై ఆధారపడే జీవన ఉపాధి కొనసాగిస్తున్న కుటుం బాలకు నాణ్యమైన చేప పిల్లల పంపిణీ అందించేలా కృషి చేయాలని మంగ మధు ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్ సానుకూలంగా స్పందించి సంఘం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.మత్స్యకారులకు రుణాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం వంటి తదితర అంశాలపై ప్రభుత్వం తరపున సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంచ రాముల ముదిరాజ్, తుమ్మల గోపాల్ ముదిరాజ్, మంగ మధు ముదిరాజ్, గూడూరు సురేష్ ముదిరాజ్, నరసింహ ముదిరాజ్, కళేశ్ ముదిరాజ్, మల్లేష్ ముదిరాజ్, శివకుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ భాష దినోత్సవం

**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ భాషా దినోత్సవాన్ని కురవి మండలం సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ధరావత్ వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు కాళోజి చిత్రపటానికి నివాళులర్పించారు. సెప్టెంబర్ 9 వ తేదీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని జరుపుతుంది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తన యాసకు పట్టం కట్టిన వాడు,"ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక", బడి పలుకుల భాష కాదు -పలుకు బడుల భాష పుట్టుక నాది, చావు నాది, బ్రతుకంతా దేశానిది" అని ఎలుగెత్తి చాటాడు కాళోజి . నిజాం నవాబుకు వ్యతిరేకంగా కలంతో సంధించాడు. ఎవరికీ భయపడని మనస్తత్వం కాళోజిది అని అన్నారు. చిన్నం ప్రదీప్ కుమార్, మరియు విద్యార్థిని, ఎండి అంజి పాషా, జి.బాలరాజు, బి .సరోజ, వి.శుభ , కే సారంగం, ఏ .ప్రగతి మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## విశ్వంభర కథనానికి స్పందించిన యంత్రాంగం

### గణాధిత్య కుటుంబానికి ఆసరగా ప్రభుత్వం

**విశ్వంభర, జగిత్యాల :** పెద్దాపూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థి గణాదిత్య జులై 28 న మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే, నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి గణాధిత్య కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవాలని జగిత్యాల జిల్లా శాలివాహన సంఘ సభ్యులు 6-8-2024 రోజున నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ 13-8-2024 నాడు గురుకుల పాఠశాల సందర్శనకు వచ్చిన డిప్యూటీ సీఎం లకు ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఘనాధిత్య తండ్రి మోహన్‌కు కోరుట్ల మండలం కల్లూరు ఆశ్రమ పాఠశాల యందు ఔట్సోర్సింగ్ విభాగంలో అటెండర్ పోస్ట్ మంజూరు చేసి నియామక పత్రాన్ని డిప్యూటీ కలెక్టర్ రాంబాబు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సత్యమ్మ అందజేశారు. శాలివాహన సంఘ సభ్యుల అభ్యర్థనను మన్నించి రాజారపు మోహన్ కుటుంబానికి ఆసరాగా నిలిచిన ప్రభుత్వానికి ప్రభుత్వ అధికారులకు నాయకులకు జగిత్యాల జిల్లా శాలివాహన సంఘ అధ్యక్షుడు మామిడి పెల్లి కృష్ణ, సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



## తెలంగాణ చేనేత భవిష్యత్తు శక్తివంతం చేద్దాం

**విశ్వంభర, ఆమనగల్లు:** సుసంపన్నమైన భారతదేశ చేనేత వారసత్వాన్ని అందిపుచ్చు కోవడానికి, ప్రోత్సహించాలనే ప్రభుత్వ నిబద్ధతలో భాగంగా సోమవారం ఆమనగల్లు మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికులు పెద్ద ఎత్తున చేనేత జౌలి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులోని లలిత కళాతోరణంలో సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా నిర్వహిస్తున్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ IINTహైదరాబాదు కేంద్రంగా ప్రారంభోత్సవానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సుస్థిరతను పెంపొందించే లక్ష్యంతో ఈ సంస్థ ప్రత్యేక కోర్సులు, శిక్షణ కార్యక్రమాలు , అధునాతన పరిశోధన అవకాశాలను కల్పిస్తోందని అన్నారు. భారతదేశ సాంస్కృతిక గౌరవం యొక్క ఈ మైలురాయి వేడుకలో మాతో రండి , చేనేత సాంకేతికత , విద్యలో కొత్త శకానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. దినోత్సవ సంఘం అధ్యక్షులు గాజుల శీను, మాడిశెట్టి గోపాల్, పాలాది పురుషోత్తం,నందు, మస్న సత్యనారాయణ, వనం యాదయ్య ఆమనగల్లు చేనేత కార్మికులు, పాల్గొన్నారు.




## ఐడిబిఐ బ్యాంక్ ప్రారంభం

**విశ్వంభర, భూపాలపల్లి:** సేవలలో ప్రజల మన్ననలు పొందాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం భూపాలపల్లి మెయిన్ రోడ్ మంజూర్ నగర్ లో ఐడిఓబి భూపాలపల్లి బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజు రోజుకు బ్యాంకుల ద్వారా లావా దేవీలు పెరిగిపోతున్న నేపద్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సేవలు అందించాలని తెలిపారు. ప్రజల సౌకార్యార్థం 112వ బ్యాంక్ బ్రాంచి కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. టిపిఎస్ సీఈ ఎం.సిద్దయ్య, ఐడిఓబి జోనల్ సిజిఎం శరత్ కామత్, జోనల్ డిప్యూటీ జిఎం వాసుదేవన్, రీజినల్ మేనేజర్ వెంకటేష్, బ్రాంచ్ మేనేజర్ జాటోత్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## గోదావరిలో భక్తుల రద్దీ

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో భక్తుల రద్దీ నెలకొంది.వర్షం కురుస్తున్నప్పటికి భక్తుల గోదావరిలో స్నానం చేసేందుకు వస్తున్నారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకొనిపూజలు చేశారు.



## విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

**విశ్వంభరా,ఎల్బీనగర్:** విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘంఆధ్వర్యంలో మహాగణపతి 37వ నవరాత్రి మహెూత్సవాల లో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య దంపతులు, చైతన్యపురి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్ గుప్తా, గౌరిశెట్టి అరుణ్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంథి రమేష్, గందే శ్రీకాంత్, డా.రాంకిషన్, కృష్ణమూర్తి, హనుమంత్ రెడ్డి, మేఘమాల, సుజాత, లక్ష్మీ, భ్రమరాంబా, లావణ్య, అరుణ, వనజలి పాల్గొన్నారు.



## ఫిజియోథెరపీ వైద్యులను నియమించాలి

**విశ్వంభర, హనుమకొండ:** ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపి డాక్టర్ కడియం కావ్య, ఫిజియో థెరపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హాజరయ్యారు. రాష్ట్రములో అన్ని జిల్లాలో ప్రభుత్వ కాలేజీలు ఏర్పాటు చేయాలనీ ఫిజియో థెరపీ క్లినిక్స్ , హాస్పిటల్స్ లో ఆరోగ్య శ్రీ లో ఫిజియో థెరపీ వైద్యాన్ని గ్రామగ్రామాన అందించాలని అన్నారు. అన్ని పీహెచ్ సి లల్లో ఫిజియోథెరపిస్ట్ లను నియమించాలని అన్ని హెల్త్ ఇన్సూరెన్సు కార్డ్స్ లకి ఫిజియో థెరపీ వైద్యాన్ని ఇవ్వాలని కౌన్సిల్ ఏర్పాటు చేసి చట్టభద్దత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు వంశీ రాష్ట్ర నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రాము ఓడితేలా డాక్టర్స్ సంపత్ రెడ్డి చిరంజీవి శ్రవణ్ శివ రామకృష్ణ సురేష్ ప్రకాష్ క్రాంతి రాకేష్. హరీష్ రాజమోహన్ సుకుమార్ మొహ్సిన్ శైలజ కమలాకర్ ప్రసన్న అజయ్ షాలిని అనూష సాయి వెంకీ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమమే ఊపిరిగా బతికిన మహామనిషి కాళోజీ


**విశ్వంభర, వరంగల్:** ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి నక్కల గుట్ట లోని కాళోజీ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా కుడా ఛైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ సాహిత్యాన్ని ప్రపంచానికి చాటిన ఆదర్శప్రాయుడు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ ప్రాంతంలోని ఎంతో మంది కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనీకుడు కాళోజీ నారాయణ రావు అని చెప్పారు. తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు తన కవితల ద్వారా తెలంగాణ ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడుగా అభివర్ణించారు.



## ఘనంగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి జన్మదిన వేడుకలు

**విశ్వంభర, మహబూబాబాద్:** ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు జన్మదినం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి ,వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోత్ రవి కుమార్, యాస వెంకట్ రెడ్డి, జెర్రిపోతుల వెంకన్న, మంగళంపెల్లి కన్నా, ముత్యం వెంకన్న గారు, నాయిని రంజిత్, నూనవత్ అశోక్, మార్నేని రఘు , దౌలాగర్ శంకర్ k.ఖలీల్ మార్నేని కిరణ్ మదత వెంకన్న, రాజు నాయక్, పుచ్చకాయల రామకృష్ణ దరావత్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





విశ్వంభర హైద్రాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన బొమ్మ మహేష్ గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులూ టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి వారి నివాసం వద్ద కలిసి కి హర్థిక శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులు అధైర్య పడొద్దు :మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హత ఉన్న రైతులందరికీ రుణ మాఫీ అవుతుందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం లో పర్యటించిన అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. కొంత మంది ప్రతి పక్ష నాయకులు సాంకేతిక పరంగా బ్యాంక్ లలో ఏర్పడిన సమస్యలను అనువుగా చేసుకొని రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఒక వైపు పకృతి వైపరీత్యం తో ఏర్పడిన అధిక వర్షాలతో వరదలు వచ్చి రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రాంతాలలో పెద్ద ఎత్తున నష్ట జరిగిందని పేర్కొన్నారు. స్వయానా ముఖ్య మంత్రి, మంత్రులు, ఎంఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు చేరువలో ఉంటూ సహాయక చర్యలు చేపట్టి వారిని ఆదుకునే కార్యక్రమం చేస్తున్నారని వివరించారు. ఎప్పుడు లేని విధంగా వరద సహాయ చర్యలకు సంబంధించి పెద్ద ఎత్తున ప్రాణ నష్టం కానీ ఆస్తి నష్టం కాకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమై ప్రభుత్వ సూచనల మేరకు యంత్రాంగం ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగిన కుటుంబాలకి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మాజీ ఎంపీపీ సంతకాని సమ్మయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీమల సందీప్, తేప్పల ప్రభాకర్, తెప్పల దేవేందర్, కదారి విక్రమ్, కుంభం రమేష్ , ఓం సింగ్ , జాడి రమేష్, చిట్టూరి మహేష్ మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి -మంత్రి శ్రీధర్ బాబు

### గంగారం మోడల్ స్కూల్ సందర్శన

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం మోడల్ స్కూల్ ను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తో కలిసి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలకు సంబం ధించిన పలు మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాలకు సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకవస్తే తక్షణమే సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ అందరూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలని అధిరోహించాలని తెలిపారు. విద్యార్థులకు ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థలను, ప్రైవేటు విద్యాసంస్థల కంటే మెరుగ్గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగు పరిచి ఉన్నతమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు వర్షంలో సైతం గంగారంలో కుటుంబాలను పరామర్శించారు.

## పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు లేదు



**విశ్వంభర, భూపాలపల్లి:** నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ కాంగ్రెస్, సిపిఐ, వైసీపీ, టీడీపీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చు కుని రాజకీయాలను భ్రష్టు పట్టించిందని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల అధ్య క్షుడు ఆకుతోట కుమారస్వామి తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిరాయింపుల విషయంలో బీఆర్ఎస్ వైఖరి చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందన్నారు. ఫిరాయింపులపై మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్ష హోదాలో ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై కేసీఆర్ తన వైఖరి ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

## బీజేపీ సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే




**విశ్వంభర, కామారెడ్డి:** సుభాష్ రోడ్డులో బిజెపి సభ్యత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా అదిలాబాద్ ఎంపీ నగేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మాజీ ఎంపీ బీబీ పాటిల్, బిజెపి నాయకులు మురళీధర్ గౌడ, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు విపుల్ జైన్, బిజెపి మున్సిపల్ ఫ్లోర్‌ల్‌డర్‌ల,సభ్యత్వ జిల్లా ఇన్చార్జ్ శ్రీకాంత్ గుప్తా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ కామారెడ్డిలో అత్యధిక బిజెపి సభ్యత్వ నమోదు చేయాలని ఒక కార్యకర్త అయిదు గురిని చేయాలని దాదాపు కామారెడ్డి నియోజకవర్గంలో జాబ్ పదివేల మంది బిజెపి కార్యకర్తలు ఉన్నారని పెద్ద ఎత్తున రాష్ట్రంలో కామారెడ్డి బిజెపి సభ్యత్వంలో మొదటి స్థానంలో ఉండాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎంపీ నగేష్ మాట్లాడుతూ కామారెడ్డిలో కార్యకర్తలు ఏదంటే అది సాధించగలరని గతంలో ఇద్దరు సీఎంలను ఓడించిన ఘనత కామారెడ్డి కార్యకర్తలకు దక్కిందని ఇప్పుడు కూడా అత్యధికంగా సభ్యత నమోదు చేయాలని ఆయన పిలుపునిచ్చారు స్థానిక ఎమ్మెల్యే చెప్పిన ప్రకారం మీరు చేస్తే రాష్ట్రంలో ప్రథమ స్థానం వస్తుందని ఆయన తెలిపారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులుకు అధికారుల చర్యలు



**విశ్వంభర, భూపాలపల్లి :** సమస్య పరిష్కారానికి ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని సమావేశపు హాలులో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 25 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరానికి చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు పరిష్కారానికి ప్రతిశాఖలో నోడల్ అధికారులు నియమించాలని, దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్ సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు.



**విశ్వంభర, భూపాలపల్లి:** రేగొండ మండలం సుల్తాన్‌పూర్ - కొత్తపల్లి గోరి కాజ్ వే పైకి వర్షపు నీరు చేరడంతో రవాణాకు ఇబ్బంది ఏర్పండింది. దీంతో వాహనాల నియంత్రణకు అధికారులు రెండు వైపులా ట్రాక్టర్‌లతో బారికేడింగ్ చేసారు.

## కుక్కలు బాబోయ్ కుక్కలు..!

### ఏ గల్లీలో చూసిన డజన్ల కొద్ది తిరుగుతున్న కుక్కలు

### వీధి కుక్కలను బంధించి..ప్రజలకు రక్షణ కల్పించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వివిధ గ్రామాలలో వీధి కుక్కలు ఏ గల్లీలో చూసిన డజన్లకొద్దీ కలియ తిరుగుతూ, స్వైరవిహారం చేస్తున్నాయని, బాటసారులను, బైకర్లను, ఆయా గ్రామాల ప్రజలను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అదేవిధంగా ఒంటరిగా కనిపిం చిన వ్యక్తులను, స్కూల్ పిల్లలను తరుముతూ ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. పలుమార్లు ముకు మ్మడిగా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. స్కూల్ కు వెళ్లే విద్యార్థులు వీటిని చూసి స్కూల్ కు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ వీధి కుక్కలు ఎప్పుడు ఎవరిని కబలిస్తాయోనని పసిపిల్లల తల్లిదండ్రులు, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విచ్చలవిడిగా సంచరిస్తున్న ఈ వీధి కుక్కలను ఇలాగే వదిలేస్తే భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని, ఎవరికి ఏ హాని జరగకముందే వీటిని బంధించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిందిగా జిల్లా ప్రజలు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకున్న నీలం మధు

### ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు



**విశ్వంభర, ఖైరతాబాద్:** గణనాథుడు ప్రజల సర్వ విఘ్నాలను తొలగించి సర్వ శుభాలను ప్రసాదించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని సోమవారం ఖైరతాబాద్ లోని వినాయకుడిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రప్రజలందరూ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద వినాయకుడిగా ప్రాచుర్యం పొంది, కోరిన కోరికలు తీర్చే గణపతిగా వినాయక నవరాత్రులలో లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ గణనాథున్ని దర్శించుకుంటారని తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్, సభ్యులు వీణ, అమీన్పూర్ కౌన్సిలర్ కొల్లూర్ మల్లేష్, ముకేష్, రాజశేఖర్, వి నారాయణ రెడ్డి, అశోక్,ఖైరతాబాద్ యూత్ సభ్యులు,ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడుకి ఎమ్మెల్యేల అభినందనలు



**విశ్వంభర, భూపాలపల్లి:** హైదరాబాద్ లోని న్యూఎమ్మెల్యే క్వార్టర్‌లో నూతనముగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నియామకం అయిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానం చేశారు. ఆయనతో పాట వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు, డోర్నకల్ శాసనసభ్యులు రాంచంద్రునాయక్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

## తెలుగు భాషా దినోత్సవం

### డాక్టర్ కాళోజీ నారాయణ రావు జయంతి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవము సందర్భంగా పూలమాలలు వేశారు. వి ద్యార్థులు తెలంగాణ మాతృ భాష తెలుగు లోని మొదటి అక్షరాల రూపం లో తెలుగుభాష ఆవశ్యకతను తెలియజేచారు. ప్రధానోపాధ్యాయులు డి.వెంకన్న మాట్లాడుతూ డాక్టర్ కాళోజీ ఆలోచనలను, అభ్యుదయ భావాలను సమాజం మరింత ముం దుకుతీసుకెళ్లాల నికోరారు. ఉపాధ్యాయులుస్వామి, వరప్రసాద్, శ్రీనివాసచారి, అనురాధ,వెంకటేశంలు పాల్గొన్నారు.

## రజనీకాంత్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం ఉప్పలపహాడ్ గ్రామంలో గుమ్మడవెళ్ళి సోమయ్య కుమారుడు గుమ్మడవెళ్ళి రజినీ కాంత్ అనారోగ్య కారణాల వల్ల మరణించారు. వారి కుటుంబానికి బీఆరెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో మాజీ సర్పంచ్ గుమ్మడవెళ్ళి మల్లయ్య రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బీఆర్ఎస్వి మండల అధ్యక్షులు చుంచు నాగరాజు,మాజీ ఉప సర్పంచ్ తాళ్ళపల్లి రాములు, కురుమ సంఘం మండల నాయకులు చిన్నం శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు గుమ్మిడవెళ్ళి రామచంద్రయ్య, గుమ్మడివెళ్లి మల్లయ్య, గుమ్మిడివెళ్ళి శివయ్య, గుమ్మడివెళ్ళి ముత్యం, గుమ్మడివెళ్ళిమారయ్య, గుమ్మిడివెళ్ళి నర్సయ్య, గుమ్మిడివెళ్ళి సురేష్,కొడిమాల బిక్షపతి పాల్గొన్నారు.

## వరద బాధితులకు సినీనటుడు బ్రహ్మానందం టీమ్ సాయం



**విశ్వంభర,మహబూబాబాద్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ఎంతో కొంత సహాయం స్వయంగా అందాలన్న దృఢ సంకల్పంతో టీమ్ బ్రహ్మా నందం మహబూబాబాద్ జిల్లాలోని ఏజన్సీ ప్రాంతమైన కే.సముద్రం లోని వరద బాధిత కుటుంబాలకు కిరాణా సరుకులు, దుప్పట్లను అందజేశారు. పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ సూచనతో సామాజిక వేత్త ఎమ్. ఏ. జలీల్, సహాయకులు ముజ్జు, స్థానిక సేవా సభ్యులు పాల్గొన్నారు. టీమ్ బ్రహ్మానందం కోఆర్డినేటర్ సినీ నిర్మాత విజయ్ వర్మ పాకలపాటి, విశ్లేషకులు జేజికే మూర్తి సేవా కార్యక్రమానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృత్జ్ఞతలు తెలియజేసారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం హైదరాబాదులోని తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నం చందర్ రావు, పెద్ద కోమటీపల్లి మాజీ సర్పంచ్ మంద సునీల్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి పున్నం చందర్ రావు మాట్లాడుతూ ఎంతో క్రమశిక్షణతో పార్టీ పట్ల విధేయతను చూపుతూ పార్టీ ఎదుగుదల కోసం కష్టపడిన బొమ్మగాని మహేష్ కుమార్ గౌడ్ సేవలను గుర్తించి అధిష్టానం ఆయనను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు.

## కరీంనగర్‌లో మెగా జాబ్ మేళా



**విశ్వంభర, కరీంనగర్:** లక్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "రోజ్‌గార్ కరీంనగర్" పేరిట మెగా జాబ్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ జాబ్ మేళా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో జరిగింది. లక్ష్ ఫౌండేషన్ చైర్మన్ , గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ అభ్యర్థి డాక్టర్ ముస్తాక్ అలీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో హైదరాబాదుతో సహా 50కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి. పదో తరగతి నుండి డిగ్రీ వరకు అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలకు వర్క్ ఫ్రం హోమ్ అవకాశాలు కూడా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అభ్యర్థులు తమ విద్యా సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఈ మేళాలో ఉదయం 10 గంటల లోపే పెద్ద ఎత్తున యువతీ,యువకులు హాజరయ్యారు. మరిన్ని వివరాలకు ఫోన్: 9750381234 సంప్రదించవలసిందిగా నిర్వాహకులు తెలిపారు.

## వరద భాదితులకు పోలీసులు చేయూత



**విశ్వంభర, మహబుబాబాద్:** ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకన్ IPS ఆదేశాలమేరకు గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దొరవారి తిమ్మాపురం గ్రామానికి చుట్టుపక్కల ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బాహ్య ప్రపంచంతో రాకపోకలు స్తంభించి పోగా నిత్యవసరాలు లభించకపోవడంతో ఆకలితో అలమటిస్తున్న గ్రామస్తుల పరిస్థితి తెలుసుకున్న గూడూరు సిఐ బాబురావు వెంటనే తన సర్కిల్ పరిధిలోని గూడూరు, కొత్తగూడ & గంగారం ఎస్.ఐలు గిరిధర్ రెడ్డి, కుష కుమార్, రవికుమార్ మరి సిబ్బందిలతో కలిసి రెండు ట్రాక్టర్‌ల సహాయముతో వరద భాదితులకు సాయం అందించారు. 23 కుటుంబాలకు 15 రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను అందించారు. నిత్యావసరాలు అందించిన పోలిసిలకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేసారు.

## ఘనంగా కాళోజి జయంతి



**విశ్వంభర, మహబూబ్ జిల్లా :** మహాకవి కాళోజి నారాయణ రావు 110వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన సమా వేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ డేవిడ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డిసిఓ వెంకటేశ్వర్లు, ఏడి గ్రౌండ్ వాటర్ వాటర్ సురేష్, డిహెచ్ఓ జి.మరి యాన్న,డిఎఓ విజయ నిర్మల, డిపిఓ హరి ప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయంలోనీ అన్ని విభాగాల సిబ్బంది..పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర,రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కక్కిరేణి గ్రామానికి చెందిన గుండాల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతనితో పాటు కలిసి చదువుకున్న గ్రామంలోని జడ్.పీ.యచ్.యస్ 2006-07 (యస్.యస్.సి) బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలిసి ఈ రోజు అతని కుటుంబానికి, పిల్లల విద్యాభ్యాసం కొరకు రూ.45,600/- ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో వారి పిల్లల చదువుల కొరకు ఎల్లవేళలా అందుబాటులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అతని మిత్రులతో పాటు సామాజిక కార్యకర్త వేముల సైదులు పాల్గొనడం జరిగింది.

## ఐఎంఏ జోన్ 3 సమావేశానికి వరంగల్ ఎంపీ



**విశ్వంభర, వరంగల్ :** తెలంగాణ స్టేట్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్ 3 సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా IMA ఆధ్వర్యంలో ఎంపీ కడియం కావ్యని ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీ డా. కడియం కావ్య ప్రసంగిస్తూ తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యుడు పునర్జన్మనిస్తాడని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తన ప్రాణాలను పణంగా పెట్టి నమ్ముకొని వచ్చిన వారిని రక్షించగలిగేది ఒక్క వైద్యులు మాత్రమే అని స్పష్టం చేశారు. అలాంటి వైద్యులు కరోనా సమయంలో ఎంతో మంది రోగులకు సేవలు అందిస్తూ తమ ప్రాణాలను కోల్పోయారని వారి కుంటుబాలను ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్ లో ప్రస్తావిస్తానన్నారు. ప్రజా ఆరోగ్యానికి సంబంధించి కేంద్రం బడ్జెట్ తగ్గించందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా వైద్యులపై జరుగుతున్న దాడులను ఎంపీ ఖండించారు. వైద్యుల సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తానాని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా IMA మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో IMA రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, IMA నేషనల్ ప్రెసిడెంట్ దిలీప్ భానుషాలి, మరియు IMA సభ్యులు డా. అశోక్ రెడ్డి, డా.అన్వర్ మియా, డా.శ్రవణ్ కుమార్, డా.విజయ్ చంద్ర, డా.నాగార్జున రెడ్డి, డా. రవీందర్, డా.సంధ్యారాణి, డా. బింగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫార్మా సిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలి

**నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి**

**పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలి**

**పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయాలి**

**గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిపై సీఎం సమీక్ష**

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ శివారులోని గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సీఎంతో పాటు పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన పరిసరాల్లో గ్రీన్ ఫార్మా సిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. పర్యావరణహితంగా కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలన్నారు. అక్కడ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని సీఎం ఆదేశించారు.



భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయాలని సూచించారు. గ్రీన్ ఫార్మా సిటీలో పెట్టుబడులకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ అండ్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే అత్యాధునిక గ్రీన్ ఫార్మా సిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. యాంటీ బయాటిక్స్, ఫెర్మంటేషన్ ఉత్పత్తులు, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, ప్రత్యేక రసాయనాలు, కాస్మోటిక్స్ తదితర సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వ విద్యాలయం ఉంటుందని అన్నారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు.

## ఫోన్ ట్యాపింగ్ భుజంగరావుపై మరో కేసు నమోదు



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు మరో బిగ్ షాక్ తగిలింది. ఆయనపై మరో కేసు నమోదైంది. కూకట్ పల్లి ఏసీపీగా ఉన్న సమయంలో ఓ భూ వివాదంలో భుజంగరావు తమను బెదిరించినట్లుగా బాధితులు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతిని కలిసి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో సైబరాబాద్ ఈ ఓ డబ్ల్యు పోలీసులు భుజంగరావుపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ లో A4 గా భుజంగరావు పేరును చేర్చారు పోలీసులు. కాగా, తెలంగాణలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావును పోలీసులు మార్చి 23న అరెస్టు చేశారు. బెయిల్ కోసం పలుమార్లు అభ్యర్థించగా.. ఆ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది.

## హైడ్రా కేసులు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వ అధికారులు



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** అక్రమ నిర్మాణాల అనుమతులకు సంబంధించి పలువురు ప్రభుత్వ అధికారులపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత సందర్భంగా ఈ అక్రమ అనుమతుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హైడ్రా ఫిర్యాదు మేరకు అధికారులపై సైబరాబాద్ ఆర్థిక విభాగం పోలీసులు కేసులు నమోదు చేశారు. చందానగర్, బాచుపల్లిలోని ప్రభుత్వ ఉద్యోగులపై ఈమేరకు చర్యలు తీసుకున్నారు. మరోవైపు కేసుల నమోదుతో ప్రభుత్వ అధికారులు తాజాగా ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బాచుపల్లి ఎమ్మార్వో పూల్ సింగ్, లాండ్ అండ్ రికార్డ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్ కుమార్ ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేసుకున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ అధికారులకు బెయిల్ ఇవ్వొద్దంటూ కోర్టును ఆర్థిక విభాగం పోలీసులు కోరారు.

## ఈడబ్ల్యూఎస్ లేకుండా మెడికల్ అడ్మిషన్లు

### మార్గదర్శకాలు రూపొందించకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు



**విశ్వంభర, హైదరాబాద్:** ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పనకు మార్గదర్శకాలు రూపొందించకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మార్గదర్శకాలపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను ఈనెల 18వ తేదీకి వాయిదా వేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పనపై మార్గదర్శకాలు జారీ చేయాలంటూ జనవరి 1న కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసినా స్పందించకపోవడాన్ని సవాలు చేస్తూ బీజేపీకి చెందిన కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ జె.శ్రీనివాస రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆగస్టు 28న తాను వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఎన్ఎంసీ నోటిఫికేషన్ ప్రకారం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం అమలు చేయాల్సి ఉందన్నారు.అయితే రాష్ట్రంలో ప్రస్తావనే లేకుండా అడ్మిషన్లు కొనసాగుతున్నాయన్నారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రతివాదులైన కేంద్ర వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కాళోజీ నారాయణరావు యూనివర్శిటీలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను 18వ తేదీకి వాయిదా చేసింది.

## రాజకీయ కర్ణుడు జిట్టా బాలకృష్ణారెడ్డి

**ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నేత**

**తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు**

**ఫ్లోరైడ్ బాధితులకు అండగా నిలిచారు**

**ప్యూరిఫై ఆర్ఓ నీటిని గ్రామ సీమలకు పరిచయం చేసిన అభినవ భగీరథుడు**



ఉద్యమ కారులకి పుట్టినిల్లు లాంటి భువనగిరి గడ్డ మరో గొప్ప నాయకున్ని కోల్పోయింది .రాజకీయాలంటే కేవలం ఓట్ల ద్వారా గెలవడం మాత్రమేనా అన్న నానుడిని పటాపంచలు చేస్తూ ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయిన నేతలు భువనగిరి ప్రాంతంలో మనకు ఎక్కువ కనిపిస్తుంటారు. బెల్లి లలిత, సామబశి వుడు లాంటి నేతలు అందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఓట్ల రాజకీయాలే నేతల గుర్తింపుకు కొలమానం అంటే ఈ దేశ ప్రధానమంత్రి ప్రముఖ జాతీయ నాయకుడు ఐన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కంటే ఎక్కువ ఓట్లు తెచ్చుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రావి నారాయణరెడ్డిని కీర్తికి ఏ కిరీటం పెట్టగలం. మహానేత తెలంగాణ సాయుధ పోరాట రథసారథి రావి నారాయణరెడ్డి వర్ధంతి ఒక్క రోజు ముందే జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి మృతి చెందడం యాదృచ్ఛికమైన నారాయణరెడ్డి సేవస్ఫూర్తిని కొనసాగించిన నేత బాలకృష్ణారెడ్డి. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో బడుగు జీవుల ఏకీకరణకు రావి నారాయణరెడ్డి ఎంతటి కృషి చేశాడో అదేపరంపరలో అదే ఉద్యమస్ఫూర్తితో జిట్టా బాలకృష్ణారెడ్డి కూడా మలిదశ తెలంగాణ ఉద్యమంలో అంతటి ఉన్నతమైన కృషిని సల్పాడు .ఒకనాడు ఆంధ్ర మహాసభకు వేదికైన భువనగిరిలో మలిదశ తెలంగాణ ఉద్యమానికి కూడా భువనగిరి కేంద్రం కావడం, అనంతరం టిఆర్ఎస్ ఆవిర్భావంతో గొప్ప ఉద్యమ ప్రాంతంగా భువనగిరి టిఆర్ఎస్ ను కూడా అంతగానే ఆదరించింది. ప్రజల ఆదరణతో టిఆర్ ఎస్లో అగ్ర నేతగ ఎదిగినవాడు బాలకృష్ణ రెడ్డి .తెరాస అంటేనే అంటే నే అంటీ ముట్టనట్టుగా ఉన్న నాటి అవకాశవాద రాజకీయ పార్టీల నేతలు ఏ ఒక్కరు కూడా టిఆర్ఎస్ జండా పట్టలేదు .అప్పటికే సామాజిక రంగంలో అనేక సేవా కార్యక్రమాల ద్వారా యువజన నాయకుడిగా మంచి గుర్తింపు ఉన్న వ్యక్తి బాలకృష్ణ రెడ్డి. నాడు హైదరాబాద్ ట్యాంక్ బండ్ కు సమీపాన జలదృశ్యానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో భువనగిరి ఖిల్లా ను అలాగే మార్చిన ఘనత బాలకృష్ణారెడ్డికే తగ్గుతుంది. బాలకృష్ణ రెడ్డి ప్రభావం భువనగిరికే పరిమితం కాకుండా నాడు ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు తెలంగాణ వ్యాప్తంగా బాలకృష్ణ రెడ్డి ప్రభ దేదీప్యమానంగా వెలిగింది. ఫ్లోరైడ్ భూతం కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్న భువనగిరి ప్రాంతం అంటే అష్ట వంకర్లు తిరిగిన కాళ్లు చేతులతో ప్రతి గ్రామం ఫ్లోరైడ్ బాధితులతో దర్శనం ఇచ్చేది. ప్రభుత్వాలు గూడ చేయలేని పనిని జిట్టా బుజాలకెత్తుకున్నాడు. ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన ప్యూరిఫై ఆర్ఓ నీటిని గ్రామ సీమలకు పరిచయం చేసిన అభినవ భగీరథుడు బాలకృష్ణారెడ్డి. భువనగిరి ప్రాంతంలో జిట్టా సహకారం అందని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. స్వయంగా తాను స్వామి వివేకానందుని ప్రభావంతో సామాజిక సేవా రంగంలోకి రావడంతో అదే స్ఫూర్తిని యువతకు అందజేయడంలో ఎనలేని కృషి చేశాడు.ప్రజలకు ఏదో చేయాలన్న తలంపుతో తాను ప్రజాప్రతి నిధిగా ఎన్నిక కావాలని కలగన్నాడే తప్పితే ఎమ్మెల్యేలు ఎంపీలు అయితే తనకు కొత్తగా వచ్చేది తెచ్చేది ఏమీ లేదన్న సంగతి తెలిసినవాడు బాలకృష్ణ రెడ్డి. పుట్టిన గడ్డకు రుణము తీర్చుకున్న బాల కృష్ణారెడ్డికి ఈ ప్రాంతం మాత్రం రుణం ఉంది ఎప్పటికీ ఈ ప్రాంతం బాలకృష్ణారెడ్డికి రుణగ్రస్తుంగానే ఉంటుంది. టిఆర్ఎస్ ఆవిర్భావంలో ధన మాన ప్రాణాలను పణంగా పెట్టి టీఆర్ఎస్ నిర్మాణం కోసం ఎంతగానో కృషి చేశాడు .తాను కష్టపడి పోగు చేసుకున్నదంత రాజకీయాల కోసమే ఖర్చు చేశాడు .అడిగిన వారికి సహాయం చేసే వ్యక్తిత్వం ఉన్న బాలకృష్ణారెడ్డి అపర దాన కర్ణుడు అని చెప్పాలి తనకున్న పరిచయాలను ఈ ప్రాంత అభివృద్ధి కోసం వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశాడు.భువనగిరి జూనియర్ కాలేజీ ని యూనివర్సిటీ స్థాయిలో నిర్మాణం చేసిన ఘనత బాలకృష్ణ రెడ్డి కే దక్కుతుంది. తెలంగాణ ఉద్యమ నిర్మాణం కావాలంటే సాంస్కృతికంగా బలమైన నిర్మాణాన్ని చేపట్టాలని తెలంగాణ అస్తిత్వాన్ని తట్టి లేపడం ద్వారా మాత్రమే తెలంగాణ ఉద్యమానికి గట్టి పునాదులు పడతాయని బాలకృష్ణ రెడ్డి గట్టిగా నమ్మేవారు. అందులో భాగంగానే ఎంతో మంది కవులను కళాకారులను ఆదరించాడు అక్కున చేర్చుకున్నాడు వాళ్ళ అవసరాలు తీర్చాడు సాంస్కృతిక ఉద్యమంలో ముందడుగులో భాగంగా తెలంగాణ సంభూరాళ్ళ పేరుతో నిజాం కాలేజీ గ్రౌండ్లో నిర్వహించిన కార్యక్రమం విజయవంతం అయ్యింది. తెలంగాణ ఉద్యమ చరిత్రలోనే నాటి కార్యక్రమం గొప్ప మైలురాయిగా చెప్పవచ్చు. ఉద్దండ కవులను కళాకారులను రచయితలను ఉద్యమకారులను రాజకీయవేత్తలను ఒకే వేదిక పైకి తీసుకొచ్చిన ఘనత తెలంగాణ సంబురాల దాని నిర్వహకుడు జిట్ట బాలకృష్ణారెడ్డికి దక్కుతుంది. తాను రాల్లేత్తిన రాజకీయ పక్షం సమీకరణల పేరుతో పోటీ చేయడానికి అవకాశం ఇవ్వలేదు. పోటీ చేయడానికి ఒక రాజకీయ పార్టీ అవసరం ఉంటుంది కాబట్టి కాంగ్రెస్ వైసిపి బిజెపి లాంటి పార్టీలను ఆశ్రయించాడు .జిట్టా ఏ పార్టీలో ఉన్న ఆ పార్టీకి గౌరవం తప్పితే ఆ పార్టీ ద్వారా జిట్టాకు దక్కిన గౌరవం ఏమీ లేదు. యువతకు రాజకీయాల్లో అన్యాయం జరుగుతుందని గ్రహించి కేవలం వృద్ధులు మాత్రమే రాజకీయాల్ని శాసిస్తూ యువతకు సరైన అవకాశాలు ఇవ్వడం లేదని తానే స్వయంగా యువ తెలంగాణ పార్టీని స్థాపించాడు అప్పటికే రాజకీయాల్లో ఉన్నదంతా పోగొట్టుకున్న నేతగా తన పార్టీని ముందుకు తీసుకోలేకపోయాడు. దీనికి తోడు నమ్ముకున్న చాలామంది మిత్రులు దూరం కావడం రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యత పెరగడంతో జిట్టా రాజకీయాలకు దూరంగా జరగడం ఇలాంటి సంఘటనలు చివరి రోజుల్లో జిట్టా బాలకృష్ణారెడ్డిని కృంగదీశాయి. దీనికి తోడు అనారోగ్యం బారిన పడడంతో తన క్రియాశీల రాజకీయాలకు దూరం జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా అన్ని రాజకీయ పార్టీలు జుట్ట బాలకృష్ణారెడ్డిని పీల్చి పిప్పి చేశాయి. నమ్ముకున్న టీఆర్ఎస్ నట్టేట ముంచడం మిగతా రాజకీయ పార్టీలు ఆయన ఇమేజ్ ను వాడుకోవడం తప్పితే ఆయనకు ఒరగబెట్టింది వన గూర్చింది ఏమీ లేదు. భువనగిరి ప్రాంతం నుండి ఎదిగొచ్చిన రావి నారాయణరెడ్డి కొమ్మిడి, నర్సింహారెడ్డి ,ఎలిమినేటి మాధవరెడ్డి ,సాంబశివుడు, బెల్లి లలిత పరంపరలో గొప్ప నేతగా జిట్టా బాలకృష్ణారెడ్డి శాశ్వతముద్ర వేయించుకున్నాడు .భువనగిరి ప్రాంతానికి ఎంతో చేసిన జిట్టా బాలకృష్ణారెడ్డికి భువనగిరి ప్రాంతం మాత్రం శాశ్వతంగా రుణపడి ఉంటుంది. వ్యక్తులను వ్యక్తిత్వాలను అంచనా వేయకుండా పార్టీ బీ ఫామ్ లీడర్లకే ప్రాధాన్యత ఇస్తే కాంట్రాక్టర్లు,రియల్ ఎస్టేట్ కార్పొరేట్ కంపనీల పాలన రాజ్యం చేస్తుంది.ప్రజా నాయకులంతా జ్ఞాపకలకే మిగులుతారు.



ఫ్రీలాన్స్ జర్నలిస్టు. దొమ్మాట వెంకటేష్

## 11న తెలంగాణకు కేంద్ర బృందం


### వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో అకాల వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం బృందాన్ని పంపనున్నది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సలహాదారు, కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ (ఆపరేషన్స్-కమ్యూనికేషన్స్) కర్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు ఉంటారు. కేంద్ర బృందం బుధవారం ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలు సహా వరద కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో బృందం పర్యటించనున్నారు. కేంద్ర బృందంలో కల్నల్ కేపీ సింగ్‌తో పాటుగా ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ, రోడ్లు, రహదారుల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విభాగాలకు చెందిన అధికారులు ఉంటారు. కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులు, అధికారులతో చర్చిస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి కేంద్ర బృందానికి నేతృత్వం వహిస్తున్న కల్నల్ కీర్తిప్రతాప్ సింగ్ మాట్లాడారు. ఆదివారం నాటి తన ఖమ్మం పర్యటనలో తెలుసుకున్న అంశాలను, బాధితుల ఆవేదన, క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు.

## నేను పెట్రోల్, డీజిల్ వాహనాలకు వ్యతిరేకం కాదు :

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**విశ్వంభర,ఢిల్లీ:** భారత్‌లో గత కొంతకాలంగా ఎలక్ట్రిక్ వాహనాలు, సీఎన్‌జీ వాహనాలపై వాహనదారులు మక్కువ చూపుతున్నారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సైతం ఈవీ, సీఎన్‌జీ ఆటోమోటివ్ పరిశ్రమలకు మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు. తాజాగా ఆయన పెట్రోల్, డీజిల్ వాహనాలపై వైఖరిని స్పష్టం చేశారు. తాను పెట్రోల్, డీజిల్ వాహనాలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. 64వ ఏసీఎంఏ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఎనర్జీ మార్చేందుకు తప్పనిసరి చేయనప్పటికీ.. మార్కెట్ శక్తులు మార్పును నడిపిస్తాయన్నారు. బజాజ్ ఫ్రీడమ్ 125 ఉదహరిస్తూ.. బైక్ సీఎన్‌జీతో నడుస్తుందని.. పెట్రోల్‌తో నడిచే మోడల్స్‌తో పోలిస్తే 40శాతం పొదుపు చేయవచ్చన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు 60శాతం వరకు ఎక్కువ ఖర్చు కూడుకున్నవని.. ఈ ఖర్చు ప్రయోజనాలు చివరికి వాహన తయారీదారులు తమ స్వచ్ఛమైన ఇంధన వాహనాలను అందించేలా చేస్తాయన్నారు. భారతదేశ వాయు కాలుష్యంలో 40శాతం రవాణారంగం ద్వారానే ఉత్పత్తమవుతోందని.. అయితే, ఆ శాఖకు తాను మంత్రిగా బాధ్యత వహిస్తున్నానని.. అది మంచిదేనా? అంటూ ప్రశ్నించారు. నైతికత, ఆర్థిక వ్యవస్థ, జీవావరణ శాస్త్రం, పర్యావరణం సమాజానికి పునాది అన్నారు.మన జీవావరణాన్ని కాపాడేందుకు.. గాలి, నీటి కాలుష్యం నుంచి రక్షించాలన్నారు. క్లీన్ ఎనర్జీ వాహనాలు వినియోగదారుకలు, పర్యావరణానికి మేలు చేయడంతో పాటు దేశ విస్తృత ప్రయోజనాలకు కూడా ఉపయోగపడుతాయని వివరించారు. ఇతర దేశాలు క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ కోసం వెతుకుతున్నాయని.. తద్వారా లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించుకోవడమే కాకుండా ఎగుమతులను పెంచుకోవడానికి కూడా సాంకేతికత, ఆవిష్కరణలు, బయో-ఇంధనాలు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను అనుసరించడం ముఖ్యమన్నారు.

## సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** కేంద్రం చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. కేంద్రం చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సహకరించాలని అందులో కోరారు. తెలంగాణలో రైల్వేలు, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం చేపడుతున్న చర్యలకు సహకారం ఉండాలని కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, చర్లపల్లి రైల్వే టెర్మినల్స్‌కు వెళ్లే రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించి పదేళ్లుగా ఆ దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధి మిషన్ మోడ్‌లో పూర్తవుతోందని పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్‌తో పాటు లైన్ల ఎలెక్ట్రిఫికేషన్ పనులు, 40కి పైగా స్టేషన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లలోని రద్దీని దృష్టిలో పెట్టుకొని చర్లపల్లిలో రూ.415 కోట్లతో రైల్వే టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తైతే పాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలకు చర్లపల్లి రైల్వే టెర్మినల్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.715 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయం స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి అత్యాధునిక వసతులతో దీన్ని ప్రజలకు అంకితం చేయనున్నామన్నారు. రేతిఫైల్, ఆల్ఫా హోటల్ వద్ద రోడ్లు ఇరుకుగా ఉండి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విషయమై చొరవ చూపాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

## బాగా పనిచేస్తున్న రాష్ట్రాలకు కేంద్రనిధుల్లో అన్యాయం



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** మంచి పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలకు కేంద్ర నిధుల్లో అన్యాయం జరుగుతోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 16వ ఆర్థిక సంఘం సమావేశం అనంతరం సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బాగున్న రాష్ట్రానికి నిధులు తక్కువ ఇస్తామనటం అన్యాయమని, బాగా పనిచేస్తున్న రాష్ట్రాన్ని ప్రోత్సహించేలా విధానాలు ఉండాలని, వాటి గొంతు నొక్కవద్దని ఆర్థిక సంఘాన్ని కోరినట్లు చెప్పారు. పన్నుల వాటా కేటాయింపులో కేంద్రం పాటిస్తున్న విధానాలు సరిగా లేవన్నారు. "ఇంటింటికి నీరు కోసం కేంద్రం హర్ ఘర్ జల్ పథకాన్ని తీసుకొచ్చింది. కానీ, దాన్ని రాష్ట్రంలో మిషన్ భగీరథ రూపంలో గతంలోనే అమలు చేశాం. మిషన్ భగీరథ పథకానికి నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ చెప్పినా నిధులు ఇవ్వలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం సూచనల్లో ఒక్కదాన్ని కూడా కేంద్రం పాటించలేదు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపూరితంగా వ్యవహరిస్తోంది"అని విమర్శించారు.

# మూసీ ప్రక్షాళన చేయాలి

**విశ్వంభర, రామన్నపేట** : మూసీ నది విషపు కాలుష్యపు నీటికి ప్రత్యామ్నాయంగా, రామన్నపేట మండలంలో అసీఫ్ నెహర్, దర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వల ద్వారా బస్వాపురం గోదావరి జలాలు అందించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని మూసీ ప్రక్షాళన గోదావరి కృష్ణా జలాల సాధన వేదిక జిల్లా సలహాదారులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కె.జే భవన్ లో జరిగిన మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల సాధనకై జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, అనంతగిరి కొండల్లో ప్రకృతిసిద్ధంగా పుట్టిన మూసీ హైదరాబాద్ మురికి నీటితో పరివాహక ప్రాంతపు పరిశ్రమల విష రసాయనాలతో వచ్చిన నీటి నుండి పంటలు పండించటం, జంతువులు త్రాగటం మూలంగా భయంకరమైన రోగాలకు గురి కావాల్సి వస్తుందన్నారు. తినే ఆహారం పూర్తిగా విషపూరితమై భవిష్యత్తు అందకారంగా మారుతుంది. క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాదుల బారిన పడి గ్రామాల్లో ప్రజలు చర్మవ్యాదులకు గురవుతున్నారు. దీర్ఘకాలిక ప్రజా సమస్యపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వెంటనే క్షేత్ర స్థాయిలో, గ్రామాల్లో, ఆరోగ్య సర్వే నిర్వహించి మూసీ నీటి విషపు గాఢతను పరిశీలించి, మూసీ నీటిని ప్రక్షాళన చేసి అసీఫ్ నెహర్ కాల్వ, దర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వల ద్వారా జిల్లాలో ఉన్న బస్వాపురం ప్రాజెక్టు నుండి నీటిని అందించి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. గోకారం, తుమ్మలగూడం చెరువులను మినీ రిజర్వాయర్లుగా నిర్మించి, నీటిని అందించడానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మూసీ ప్రక్షాళన, గోదావరి-కృష్ణా జలాల సాధన వేదిక జిల్లా నాయకులు బట్టు రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు




మేక అశోక్ రెడ్డి, నాయకులు జల్లల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, బోయిని ఆనంద్, బల్గూరి అంజయ్య, కూరెళ్ళ నర్సింహచారి, గాదె నరేందర్, మామిడి వెంకట్ రెడ్డి, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, వేముల సైదులు, రషీద్, మేడి గణేష్, గొరిగె సోములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పారుపల్లి గ్రామంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ ఇటీవల మరణించిన మాజీ సర్పంచ్ మాధవరెడ్డి తండ్రి వారి కుటుంబాన్ని, దయ్యాల మల్లయ్య యాదవ్ కుటుంబాన్ని స్వగ్రామమైన పారుపల్లిలో సోమవారం రోజు పరామర్శించారు. వీరితోపాటు పారుపల్లి తాజా మాజీ సర్పంచ్ లగ్గాని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.



## బీసీలకు పెద్ద పీట



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, తాజా మాజీ వార్డు సభ్యులు పెద్దగాని వెంకటయ్య గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు పెద్ద పీట వేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బీసీ నాయకుడైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి శాసన మండలి సభ్యులుగా, పీసీసీ అధ్యక్షులుగా నియమించి బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఏ ఐ సి సి పెద్దలకు, పీసీసీ పెద్దలకు , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి , ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి ధన్యవాదాలు తెలిపారు. బీసీ కులగణన చేసి బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## జడ్పీహెచ్ఎస్ పల్లెర్లలో కాళోజీ జయంతి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు డాక్టర్ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా కాళోజీ చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పూలమాల వేసి తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కె శ్రీనివాసరావు మాట్లాడుతూ పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అని చెప్పడమే కాకుండా వారి జీవితాన్ని తెలంగాణ ప్రజల కోసం అంకితం చేశారని విద్యార్థినీ విద్యార్థులు కూడా కాళోజీ అడుగు జాడల్లో నడవాలని అలాగే చెప్పినట్లుగా తెలంగాణ యాస, భాష సంస్కృతిని పరీరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ చాడ లక్ష్మీ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు వెంకట నర్సయ్య, పల్లె శంకర్, విజయ్ కుమార్ రెడ్డి, త్యాగరాజు చారి, పి శేఖర్, సమీనా బేగం, నాగమల్లు, రవీందర్, మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## మానవసేవయే..మాధవ సేవగా: ప్రొ. జయశంకర్ ఫౌండేషన్

**విశ్వంభర, భూపాలపల్లి:** మానవసేవయే మాధవ సేవగా ప్రొ. జయశంకర్ ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతీ ప్రయాణికుల సౌకర్యార్థం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 5 బెంచీలను ఏర్పాటు చేశారు. అయిలి మారుతీ విలేకరులతో మాట్లాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రి, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వందలాది మంది వస్తుండడంతో బస్ షెల్టర్ వద్ద ప్రయాణికులు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా ఇటీవల ఒక వృద్ధురాలు బస్సు షెల్టర్ వద్ద నిలబడి కళ్ళు తిరిగి పడిపోవడం తనను కలచివేసిందని, దీంతో పేద ప్రజలకు సేవ చేయడంలోనే దైవత్వం దాగి ఉందని భావించిన తాను ప్రజల సౌకర్యార్థం తన సొంత ఖర్చులతో 5 బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతీని అభినందిస్తున్నారు.




## తెలంగాణ భాషా దినోత్సవం

**విశ్వంభర, షాద్ నగర్ :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం నాడు షాద్ నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'తెలంగాణ భాషా దినోత్సవా'న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, విద్యార్థులు సమావేశమై, తమ ప్రసంగాల ద్వారా కాళోజీ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు మాట్లాడుతూ కాళోజీ బాల్యం, విద్యాభ్యాసం జరిగిన తీరును వివరించారు. కాళోజీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తీరును వివరించారు. 'నా గొడవ'లోని కవితలను చదివి వినిపించారు. అకడమిక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ, 'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక' అని కాళోజీ ప్రస్తావించిన అంశాన్ని ఉటంకించారు. ఆర్థికశాస్త్ర అధ్యాపకులు డా.పి.సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ప్రధాని పి.వి.నర్సింహారావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు మొదలైన మహనీయులతో కాళోజీకి మధ్య ఉన్న అనుబంధాన్ని వివరించారు. అధ్యాపకులు డా.జి. బంగ్లాభారతి, డా.టి.విజయ లక్ష్మి, డా.సి.శాంతి, జి.విజయ జ్యోతి, డా.జయ కాగడ, డి.దేవయ్య, డా.నదీరా బేగంలతో పాటు మురారి, శివ శంకర్, పల్లవి మొదలైన విద్యార్థులు పాల్గొన్నారు.



## యూడైస్ ప్లస్ అన్ని పాఠశాలలో అమలు చేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్ జిల్లా** : సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన యూడైస్ ప్లస్ పథకం ద్వారా పాఠశాలల బలోపేతం వివరాల సేకరణ లపై సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనీ (1219) ప్రభుత్వ ప్రైవేటు ఎయిడెడ్, మహాత్మ జ్యోతిరావు పూలే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గిరిజన పాఠశాలలలో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థుల యొక్క పూర్తి వివరాలు నమోదు చేయాలని, దాని ద్వారా పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ ప్రతి విద్యార్థికి వస్తుందన్నారు,ప్రతి పాఠశాలలోని మౌలిక వసతుల కల్పన టాయిలెట్స్, త్రాగునీరు, విద్యుత్, బ్లాక్ బోర్డ్స్, ఫ్యాన్స్, టేబుల్స్, క్లాస్ రూమ్స్, తదితర అన్ని వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల వివరాలు, ప్రభుత్వ, కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రతి ఒక్కరికి వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు, ఈ యూడైస్ ప్లస్ పథకం ద్వారా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతుల, వివరాలు ఆన్లైన్లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందని తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వి. రాజేశ్వర్, అన్ని విభాగాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నవరాత్రులు



**విశ్వంభర, వెల్దండ** : వెల్దండ మండల కేంద్రంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ముదిరాజ్ గణేష్ వద్ద సోమవారం కాంగ్రెస్ సీనియ ర్ నాయకులు మట్ట వెంకట య్య గౌడ్ ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యుల ను అభినందించారు. వెంక టయ్య గౌడ్ ను సన్మానించి వినాయకుడి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాగేపల్లి రామకృష్ణ, పుట్ట యాదయ్య, అన్యపు రామస్వామి, తిరుపతి రెడ్డి, మారేపల్లి, బాగేపల్లి అరుణ్, పిల్లి శేఖర్, తుంగ శ్రీను, కిష్టాలు, కాసారాపురాజు తదితరులు పాల్గొన్నారు.

## నిధులు ప్రస్తుత జనాభా మేరకు ఇవ్వాలి

### రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**విశ్వంభర, రంగారెడ్డి:** తెలంగాణ ప్రజా భవన్ లో కేంద్ర 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డా?? అరవింద్ పనాగరియా అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ ఐఏఎస్, కమిషనర్ అనితారామచంద్రన్ ఐఏఎస్, ఫైనాన్స్ కమిషనర్ రామకృష్ణారావు ఐఏఎస్ , తాజా మాజీ ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో 16వ ఆర్థిక సంఘంలో చేర్చవలసిన ముఖ్య సూచనలను స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీల పనితీరు అదేవిధంగా పంచాయితీలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా పంచాయతీలకు 85%, మండల పరిషత్ లకు 10%, మరియు జిల్లా పరిషత్ లకు 5% చొప్పున అందుతున్న నిధుల వినియోగం గురించి ఆయా ప్రజా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

## మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ టోకెన్ సమ్మె నోటీస్




**విశ్వంభర,మెట్ పల్లి:** మండల విద్యా శాఖ అధికారికి టోకెన్ సమ్మె నోటీస్ను తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అందజేశారు. 22 సంవత్సరాల క్రితం మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఎవరు ముందుకు రాని రోజుల్లో 22 సంవత్సరాల నుండి మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నామన్నారు. సెంట్రలైజ్ కిచెన్ విధానం ద్వారా పాఠశాల వంట కార్యక్రమాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 54,200 మంది జీవనోపాధిని కోల్పోతారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సగటు వంట కార్మికులకు 2000 రూపాయలు జీతం కొన్ని నెలల నుండి రావడం లేదని మెస్ బిల్లు చార్జీలు కూడా చెల్లించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయలు ఇస్తానన్న జీవో విడుదల చేసి కార్మికులను ఆదుకోవాల్సిందిగా కోరారు. ప్రభుత్వమే కోడిగుడ్లు ఇతర సరుకులు సమకూర్చాలని కోడిగుడ్ల ధరలు పెరిగిన దృశ్య విద్యార్థులకు అందించలేకపోతున్నామని పెరిగిన ధరల బిల్లులు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు సుతారి రాములు, ఎండి ఉస్మాన్, సులోచన, సరస్వతి, పి పద్మ, సుజాత, భారత లావణ్య, రజిత, మధ్యాహ్న భోజన సభ్యులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత



**విశ్వంభర, మహేశ్వరం :** జల్పల్లి మున్సిపాలిటీలో మంజూరైన 128 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మహేశ్వరం నియోజకవర్గము ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అందజేశారు. లబ్ధిదారులు సబితా ఇంద్రారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూప్రజా సంక్షేమమే తన లక్ష్యమని తెలిపారు. కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇప్పటివరకు రాలేదని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరం నియోజకవర్గమును మీ అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నాం. కానీ కొందరు స్వార్థ పూరితంగా అభివృద్ధిని అడ్డుకుం టున్నారు. నియోజకవర్గంలో గతంలో మంజూరైన 250 కోట్ల నిధులు ఆపేశారు, ఆపేసిన స్పెషల్ ఫండ్ , హెచ్ఎండిఏ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జల్పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, బాలాపూర్ ఎమ్మార్వో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన మాజీ జడ్పిటిసి

**విశ్వంభర ,మహేశ్వరం :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్ష్యడిగా మహేష్ కుమార్ గౌడ్ ఎన్నికైన శుభ సందర్భంగా కందుకూరు మండల్ మాజీ జడ్ పి టి సి బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు మండల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ బిడ్డకు పట్టం కట్టినందుకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఎస్యుఎల్ నుంచి పి సి సి అధ్యక్షుడిగా ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సామాన్యులకు పట్టం, అన్ని వర్గాలకు సమ న్యాయం చేసేది జరిగేది ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే అని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోరుప్రోలు రాణా ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్,సభవత్ లచ్య నాయక్, మునవత్ పాండు నాయక్, కంబాల పల్లి విష్ణువర్ధన్ రెడ్డి, అనేగోని పాండు గౌడ్,మంద సాయిలు,సూరసాని రాంరెడ్డి,గొరిగే రాజు, అండెకర్ సురేందర్, డిల్లి కృష్ణ, రావుల జంగయ్య,రాంరెడ్డి,మహేందర్ రజినీకాంత్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## టిపిసిసి అధ్యక్షుడితో కేఎల్ఆర్ భేటీ

**విశ్వంభర, మహేశ్వరం :** తెలంగాణ నూతన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకం అయిన ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్న గారి లక్ష్మారెడ్డి సన్మానించారు. ప్రజాభవన్ లో మహేష్ కుమార్ గౌడ్తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీసీ బిడ్డకు పట్టం కట్టినందుకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ ఎన్ఎస్ యు ఎల్ నుంచి టి పి సి సి అధ్యక్షుడి ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని కేఎల్ఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.సామాన్యులకు పట్టం, అన్ని వర్గాలకు సమ న్యాయం చేసేది జరిగేది ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే అని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ గుర్తు చేశారు.



## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**విశ్వంభర, రామన్నపేట:** మండలం కేంద్రంలో ఎంపీడీవో ఆఫీసు నందు తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామన్నపేట ఎంపీడీవో యాకూబ్ నాయక్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఆయన యొక్క గొప్పతనాన్నివివరించారు. ఎంపీఓ, సూపరిండెంట్, ఏపీవో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన పునరుద్దరణ పనులు చేపట్టాలి

## ప్రజావాణిలో 84 ధరకాస్తులు.

## దరఖాస్తులు త్వరగతిన పరిష్కరించాలి.

## కలెక్టరేట్ సిబ్బంది అందరు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పాటించాలి.

## సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.



**విశ్వంభర, చివ్వెంల :** వరద ముప్పు ప్రభావిత ప్రాంతాలలో జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి యుద్ధప్రాతిపదికన పునరుద్దరణ పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి కలెక్టర్ ప్రజవాణిలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలో అతి భారీ వర్షం నమోదు కావటంతో అధికారులు అందరు అప్రమత్తత అవ్వటంతో పెద్ద ప్రమాదం నుంచి బయటపడినామని వరదతో తెగిపోయిన కాలువ కట్టలు, చెరువులు, దెబ్బ తిన్న రోడ్లు, కరెంట్ స్తంబాలు, ట్రాన్సపార్మార్లకు మరమ్మతులు చేపట్టాలని అలాగే అధికారులు వరదతో మునిగిన పంట పొలాలు, మరణించిన పశువులపై, కూలిన ఇండ్ల పై నివేదికలు అందించాలని తదుపరి ప్రభుత్వం ప్రజలకు నష్ట పరిహారం అందిస్తుందని అన్నారు. సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్సియల్ పాఠశాలలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు సందర్శించి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా శానిటేషన్ చేపించాలని అలాగే హాస్టల్స్ కి, పాఠశాలలకి సంబంధించి నివేదికలు అందజేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. మహాత్మ జ్యోతి బాపూలే ప్రజా భవన్ నుంచి వచ్చే రాష్ట్ర స్థాయి ప్రజావాణి దరఖాస్తులు అలాగే జిల్లా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్ లో జరిగే ప్రజావాణి కార్యక్రమం మంగళవారం తేది 10-9-2024 ను బుధవారం తేది 11-9-2024 కి వాయిదా వేయటం జరిగిందని ప్రజలు ఈ విషయాన్ని గమనించి బుధవారం ప్రజావాణికి వెళ్లాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ సిబ్బంది అందరు తప్పకుండా బయోమెట్రిక్ ద్వారానే హాజరు నమోదు చేసుకోవాలని లేనిచో చర్యలు తీసుకోవటం జరుగుతుందని ప్రతి నెల పూర్తి అవ్వగానే సంబంధిత జిల్లా అధికారులకు కార్యాలయ సిబ్బంది హాజరు వివరాలు అందజేయాలనీ కలెక్టర్ అన్నారు. జాతీయ స్థాయి లో అందించే 9 రకాల పంచాయతీ రాజ్ అవార్డులకు గ్రామ పంచాయతీ లు దరఖాస్తు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. నేటి ప్రజావాణి లో భూ సమస్యలకి సంబంధించి 43 దరఖాస్తులు,జిల్లా సంక్షేమ అధికారికి 7 దరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారికి సంబందించి 6 దరఖాస్తులు, డి ఆర్ డి ఓ కి సంబంధించి 5 దరఖాస్తు లు, మొత్తం 84 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సి ఈ ఓ అప్పారావు, డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి ఈ ఓ అశోక్, డి యం హెచ్ ఓ కోటాచలం,సంక్షేమ అధికారులు శంకర్, లత, అనసూర్య, జగదీశ్వర్ రెడ్డి,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## పేరుకే కేసీఆర్ నగర్.. సౌకర్యాలు, రక్షణ చర్యలు శూన్యం

### పేదలని చిన్న చూపే కారణమా

### అధికారుల, పాలకుల నిర్లక్ష్యంతో తృటిలో తప్పిన ప్రమాదం



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల జిల్లా:** తంగళ్ళపెల్లి మండలం కెసిఆర్ నగర్ లో ఇంటి బయట మీటర్ ఛానల్ బోర్డ్ వద్ద విడిచిన చెప్పులు వేసుకుంటుండగా కరెంట్ విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. 97బ్లాక్ వద్ద ఉంటున్న కొలిపాక రాము, రూపల కూతురు లాస్య (7) కు ప్రమాదం జరిగింది. విద్యుత్ మీటర్లు ఒకే దగ్గర అమర్చిన సెస్ అధికారులు అయా ప్రాంతాల్లో తగు రక్షణ చర్యలు చెప్పటకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రజలు సెస్ అధికారుల తీరును తప్పు పడుతున్నారు. సెస్అధికారులుప్రమాద స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## వియత్నాం ప్రజలు ఆదర్శప్రాయం




**విశ్వంభర, హైద్రాబాద్ :** అమెరికా సామ్రాజ్యానికి వ్యతిరేకంగా వియత్నాం ప్రజలు హెూచిమిన్ నాయకత్వంలో పోరాడి గెలిచిన విధానం అందరికి ఆదర్శప్రాయమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆ దేశ ప్రజల త్యాగాలు, పోరాటాలు, పాలన వ్యవహారాలను తాము క్షుణంగా అధ్యయనం చేసినట్లు ఆయన వివరించారు. వియత్నాం దేశం పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి స్వదేశానికి చేరుకున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డిని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) ఘనంగా సన్మానించింది. హైదరాబాద్ హిమాయత్ ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో ఐప్సో రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, జి.రఘుపాల్ అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో చాడ వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పర్యటన ప్రాధాన్యత అంశాలను వివరించారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా నేతృత్వంలోని తమ ప్రతినిధి బృందం వియత్నాం దేశ పర్యటన విజయవంతంగా జరిగిందన్నారు. వియత్నాం దేశానికి సంబంధించిన ప్రభుత్వ విధానాలు, ప్రజల జీవన స్థితిగతులు, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర అనేక అంశాలను ఈ సందర్భంగా ఐప్సో సభ్యులకు చాడ వెంకట రెడ్డి వివరించారు. చాడ వెంకటరెడ్డి హెూచిమిన్ జ్ఞాపికను ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అందజేశారు. అదేవిధంగా ఇటీవల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఎన్.బాలమల్లేష్ ఐప్సో ఘనంగా సన్మానించింది. ఐప్సో రాష్ట్ర నాయకులు వెంకట రామిరెడ్డి, జె.కె. శ్రీనివాస్, అనూష, గురుబచ్చన్ సింగ్, రామరాజు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



**విశ్వంభర, నకిరేకల్:** ఇటీవల నల్లగొండ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం స్వీకరించిన తాటికల్లు ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు మార్త రాములును నకిరేకల్ లయన్స్ క్లబ్ తరపున ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ బాధ్యులు ప్రకాష్ రావు కందాల పాపిరెడ్డి ఈ కార్యక్రమానికి సారధ్యం వహించారు.ఈ సందర్బంగా సన్మాన గ్రహీత రాములను పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాపూరం వెంకన్న,ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, డా. సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య తదితరులు అభినందించారు.

## టీఎన్జీవోస్ నేత ముజిబ్‌ను సన్మానించిన రాజ్ కుమార్




**విశ్వంభర, బషీర్ బాగ్ :** టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్ ఎం హుస్సేని ముజీబ్, హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్, సెక్రటరీ ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ డేవిడ్, ట్రెజరర్ ప్రేమ్ లు కారుణ్య నియామకాల కోసం విస్తృతంగా కృషి చేశారు. కారుణ్య నియామకాల కోసం పంపిన అభ్యర్థనను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆమోదించారు. అనంతరం హైదరాబాద్ డిఈవో కారుణ్య నియామకాలు చేపట్టారు. జిహెచ్ఎస్ కవాడిగూడలో స్కూల్ లో ఆఫీస్ సబార్డినేట్‌గా వెంకట లక్ష్మీ, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీస్ నాంపల్లిలో ఆఫీస్ సబార్డినేట్‌గా రేణుక ను నియమించారు. కారుణ్య నియామకాల కోసం డీఈవో రోహిణి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరిండెంట్ రాజ్‌కుమార్ సోహేల్‌లు ప్రాసెస్ చేసారు. టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ ను టీఎన్జీవోస్ నేతలు రాజ్ కుమార్, భాస్కర్, రవి, ఫిరోజ్ అహ్మద్, ముజాహిద్ లు పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. టీఎన్జీవోస్ హైదరాబాద్ సెక్రటరీ విక్రమ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ ఖలీద్ అహ్మద్, పిఆర్‌ఓ జాంగిర్, ఏపీఆర్ఓ వాహిద్‌లు వహీద్, శ్యామ్,సుదర్శన్, కలీమ్‌మీర్జా, లక్ష్మీపతి,జాంబయ్య,రమేష్,పరమేష్,దామోదర్, ఐజాజ్, మధు, రథన్ పాల్గొన్నారు.

## కాళోజి స్ఫూర్తి ముందు తరాలకు అందించాలి




**విశ్వంభర, నకిరేకల్:** జీవితమంతా ప్రజా పక్షం వహించి అన్యాయాన్ని ఎదిరించిన కాళోజీ స్ఫూర్తిని ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ కవి తుల శ్రీనివాస్ అన్నారు. నకిరేకల్ మండలం తాటికల్ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తుల శ్రీనివాస్ కవిత్వ నిర్మాణ పద్ధతులను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న,ఉపాధ్యాయులుమోసంగి హరీష్ చంద్ర, డా. సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణపతి పూజకు హాజరైన సాయి కుమార్ బాబా



**విశ్వంభర, సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లో కాంగ్రెస్ సీనియర్ లీడర్, కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ సొసైటీ యూత్ అసోసియేషన్, 60 సంవత్సరాల నుంచి గణపతి నవరాత్రులు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ఈ విఘ్నేశ్వరునికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని వినాయకుని దర్శించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సద్గురు సాయి కుమార్ బాబా, నర్సింగ్ రావు, తిరుపతి, శంకర్, శ్యాంసుందర్, రామ్ కుమార్, ప్రశాంత్ కుమార్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నిమజ్జనముకు అన్ని ఏర్పాటు



**విశ్వంభర, పరిగి:** భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని డిఎస్పీ కరుణాసాగర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను లక్నాపూర్ ప్రాజెక్ట్ వద్ద సోమవారం నాలుగు గంటలకు డిఎస్పి కరుణాసాగర్ రెడ్డి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల లక్నాపూర్ ప్రాజెక్ట్ నిండుకుండల మరిందని, గణేష్ ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్, సిఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, ఎమ్మార్వో ఆనంద్ రావు, ఎస్ఐ సంతోష్ కుమార్, కౌన్సిలర్లు కృష్ణ నాగేశ్వర్ పాల్గొన్నారు.

## రోడ్డును బాగు చేయండి



**విశ్వంభర, పూడూరు:** మండలం పరిధిలోని కంకల్ గ్రామంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం భారతీయ జనతా పార్టీ నాయకులు నిరసన తెలుపుతూ కంకల్ గ్రామంలో రోడ్డును 12 సంవత్సరాల నుంచి రోడ్డులో ఎవరు పట్టించుకోవడంలేదని, రోడ్లన్నీ బురదమయంగా అయ్యాయని, ప్రభుత్వానికి విన్నవించినా, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ కంకల్ నాయకుల ఆధ్వర్యంలో బుదదమయమైన రోడ్ల పై వరినట్లు వేసి నిరసన తెలిపారు . ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి బురదమైనటువంటి రోడ్డును బాగు చేయాలన్నారు. లేనిపక్షంలో కంకల్ నుంచి చిట్టంపల్లి గేట్ వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బిజెపి నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, పూడూరు మండల ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, గ్రామ శక్తి కేంద్రం ఇంచార్జి విటల్, నాయకులు అశోక్, శివకుమార్, చంద్రశేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సోమవారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో 234 మందికి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, బిపి, షుగర్, జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన పడిన వారికి మందులు అందజేసీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ రఘు వర్ధన్ రెడ్డి, కటికేల శేఖర్ యాదవ్, నిదురం యాదయ్య, కృష్ణ, శ్రీరామ్ కృష్ణయ్య, దశారతం, అఖిల్, యాదగిరి, బుచ్చిబాబు, అశోక్ గౌడ్, పాల్గొన్నారు.

## ఘనంగా మార్కండేయ గణేష్ ఉత్సవాలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు భక్త మార్కండేయ యువజన సంఘం ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద మూడవరోజు యువజన సంఘం నాయకులు ఎంగలి రమేష్, రమ్యశ్రీ దంపతుల ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయ పూజారి శరత్ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, యువజన సంఘం అధ్యక్షులు ఎం రవి, చెరుకు రవి, ఎంగలి ప్రసాద్ చిలువేరు వాసుదేవ్ చెరుకు వెంకటయ్య తదితరులు.

## అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



**విశ్వంభర, మహేశ్వరం :** సర్ధార్ నగర్ గ్రామంలో తుమ్మల చెరువు ను ఆధారంగా సర్కారీ భూమి చూసి లోకాయుక్త సుమోటో కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా కొంత మంది ఇచ్చిన ఆధారాల ప్రకారంగా అది అనుకూలంగా లేకపోవడంతో లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ అధికారి మతివ్ కోషి స్వయంగా పరిశీలన చేసారు. చెరువు అనేది లేకపోవడంతో చెక్ డాం టౌన్ అధికారి ఇతర అధికారుల ఏలాంటి పర్మిషన్‌లు ఇవ్వలేదని అన్నారు. ఎం ఆర్ ఓ కూడా ఇది ప్రభుత్వ భూమి అన్ని నిర్ధారించారు. ప్రస్తుతం పరిశీలన చేసిన లోకాయుక్త వారు పైన అధికారులకు వివరించి గ్రామస్థులకు పరిష్కారం తెలియపరుస్తాం అని తెలిపారు.

# రాష్ట్రాలకు నిధుల విభజనలో ప్రస్తుత కొలమానాలు మారాలి : హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్ :** అత్యధిక తలసరి ఆదాయం ఉన్న తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, సిదిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రాలకు నిధుల విభజనలో ప్రస్తుత కొలమానాలు మారాలని 16వ ఆర్థిక సంఘానికి సూచించినట్లు ఆయన తెలిపారు.కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ బనగారియా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం నేడు ప్రజాభవన్‌లో పలు రాజకీయ పార్టీలు, స్థానిక సంస్థలు, వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ తరపున హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కేపీ వివేకానంద హాజరయ్యారు. తొలి రోజు 16వ ఆర్థిక సంఘం ముగిసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 16వ ఆర్థిక సంఘానికి బీఆర్ఎస్ తరపున పలు ప్రతిపాదనలు చేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రాలకు నిధుల విభజనలో ప్రస్తుత కొలమానాలు మారాలని సూచించాం. బాగున్న రాష్ట్రానికి తక్కువ నిధులు వచ్చేలా ప్రస్తుత విధానం ఉంది. మంచి పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోంది. అత్యధిక తలసరి ఆదాయం ఉన్న తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. బాగా పని చేస్తున్న రాష్ట్రాన్ని ప్రోత్సహించే విధానాలు ఉండాలి. పన్నుల వాటా కేటాయింపులో కేంద్రం పాటిస్తున్న విధానాలు సరిగా లేవు. పట్టణీకరణ పెరుగుతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు నష్టం జరుగుతోంది. తెలంగాణలో ఎత్తిపోతల పథకాలు మాత్రమే సాధ్యమవుతాయి. ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం తప్పకుండా నిధులు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



## భూదాన్ పోచంపల్లిలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**విశ్వంభర, యాదాద్రి భువనగిరి :** కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్సు స్కీం ఆటో డ్రైవర్లపాలిట శాపంగా మారింది. గిరాకీలేక.. బతుకు దారి కనిపించక ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో వారి కుటుంబాలు రోడ్డునపడు తున్నాయి. చేసిన అప్పులు కట్టలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో మరో ఆటో డ్రైవర్ మృతి చెందాడు.ఈ విషాదకర సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన రావుల నగేష్ (35) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, ఆటోకి గిరాకీ లేక అప్పుల బాధ భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నగేష్ మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి.

## అద్దె చెల్లించలేదని గురుకుల పాఠశాల గేటుకు తాళం

### వనపర్తి జిల్లాలో ఘటన.
### రేవంత్‌ను సచివాలయంలో ఉంచి తాళమేసే రోజులొస్తాయి.
### సీఎంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్.



**విశ్వంభర, వనపర్తి, హైదరాబాద్:** గురుకుల భవనానికి అద్దె చెల్లించడం లేదని యజమాని ఆగ్రహం వ్యక్తం చేశాడు. సోమవారం వనపర్తి జిల్లా నాగవరం వద్ద ప్రైవేటు భవనంలో పెద్దమందడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 618 మంది, డిగ్రీ కాలేజీలో 400 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. కాగా, పాఠశాల భవనానికి నెలకు రూ.3 లక్షలు (8 నెలలకు రూ.24 లక్షలు), కళాశాల భవనానికి నెలకు రూ.4,50,601 (8 నెలలకు రూ.36,04,808) చొప్పున పెద్ద మొత్తంలో అద్దె చెల్లించాల్సి ఉంది. దీంతో బకాయిలు మొత్తం వెంటనే చెల్లించాలని భవనం ప్రధాన గేటుకు తాళం వేశాడు. దీంతో విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు అక్కడే నిరీక్షించారు. యజమానితో ఉన్నతాధికారులు ఫోన్‌లో మాట్లాడి త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం తర్వాత గేటుకు తాళం తీశాడు. సీఎం రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికే టీచర్లకు సరిగా జీతాలు ఇవ్వని కాంగ్రెస్ సర్కార్.. గురుకులాల అద్దె భవనాలకు బిల్లులు చెల్లించక పోవడంతో.. గేట్లకు తాళాలు వేస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు.రోమ్ నగరం తగలబడి పోతుంటే కోటలో కూర్చొని ఫిడేలు వాయించినట్లుగా తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలన ఉందని ఆర్ఎస్పీ విమర్శించారు. ఉదాహరణకు.. సోమవారం ఉదయం వనపర్తి జిల్లాలో గురుకుల డిగ్రీ కళాశాల, పెద్దమందడి పాఠశాలలకు గత తొమ్మిది నెలలుగా అద్దె చెల్లించలేదు. దీంతో బిల్డింగ్ ఓనర్ వందల మంది పిల్లలు లోపల ఉండగానే బయటనుండి తాళం వేసుకొని పోయాడు. కిరాయి చెల్లిస్తేనే ఉపాధ్యాయులను లోపలికి పోనిస్తాను అంటున్నడంట! మరోవైపు ముఖ్యమంత్రి గారేమో హైడ్రా మత్తులో మునిగితేలుతున్నరు! అంటూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు.సీఎం రేవంత్ రెడ్డి గారూ.. పేదల ఇళ్లను కూల్చి రాక్షసానందం పొందడం కాదు.. దమ్ముంటే ప్రజల్లో తిరిగి వాళ్ల కన్నీళ్లు తుడవండని సూచించారు. లేకపోతే త్వరలోనే ప్రజలు మిమ్మల్ని సచివాలయంలో పెట్టి బయటనుండి తాళమేసే రోజులు వస్తాయని ఆర్ఎస్పీ పేర్కొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి కాళోజీ



**విశ్వంభర, నల్లగొండ:** తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి కాళోజీ నారాయణరావు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్యాయం ఉన్న చోట తిరుగుబాటు.. ప్రశ్నించే గొంతుక అలవాటు చేసుకోండని అంటూ పిలుపునిచ్చిన మహనీయుడు కాళోజీ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళోజీకి మంచి గుర్తింపు వచ్చేలా చేశాం. కాళోజీ పేరుతో కళాక్షేత్రం, విద్యాలయం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కాళోజీ ఆశయాలకు అనుగుణంగా మనం నడువడమే ఆయనకు మనమిచ్చే అసలైన నివాళి అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తులు, తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం ఖాయం



**విశ్వంభర, నల్లగొండ:** బీఆర్ఎస్ బి ఫామ్ పై గెలిచి, పార్టీ మారిన ద్రోహులకు చెంప పెట్టులా హైకోర్టు తీర్పు వచ్చింది. ప్రజాస్వామ్యం పై నమ్మకం పెరిగేలా కోర్టు తీర్పు ఉంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాకోర్టులో కూడా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. వారిపై అనర్హత వేటు పడటం ఖాయమన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని పేర్కొన్నారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. ఇక హైడ్రా పేరుతో రేవంత్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నడు. హైదరాబాద్ అంటేనే భయపడేలా చేసిండు. చట్టప్రకారం కాకుండా అడ్డగోలుగా బొల్డోజర్లతో రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చేస్తూ హైడ్రామా అడుతున్నాడు. రేవంత్ చర్యలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నయని మండిపడ్డారు. అసలు చెరువులు ఎన్ని? వాటి హద్దులు ఎన్ని? అని నిర్ణయం జరగాలి. పేదలకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు. బడా బడా బాబుల విషయంలో ఒకలా పేదల విషయంలో ఒకలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైడ్రాపై విశ్వాసం పోతోంది : బండి సంజయ్



**విశ్వంభర,కరీంనగర్ బ్యూరో:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు 'హైడ్రా' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రామాలాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్ క్లాక్ టవర్ వద్ద సోమవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.గత కొద్దిరోజులుగా హైడ్రా వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే విశ్వాసం పోతోందన్నారు. సామాన్యులను కూడా ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను మొదట హైడ్రాకు సపోర్ట్ చేసిన, పెద్దలు అక్రమంగా కట్టుకున్న భవనాలను, విల్లాలను, ఫాం హౌజ్ లను కూలిస్తే సమర్థించిన. కానీ, పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకునే షాపులను, పేదల ఇండ్లను కూలుస్తున్నరు. ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చ రించారు. హైడ్రా వ్యవహరిస్తున్న తీరు సరికాదు. ఎందుకీ హైడ్రామాలు అక్రమ భవనాలకు, ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో కడుతున్న ఇండ్లకు పర్మిషన్ ఎందుకు ఇచ్చారు ఇప్పుడెందుకు కూలుస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## అక్షర పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



**విశ్వంభర,సూర్యాపేట:** అక్షర ఫౌండేషన్ సూర్యాపేట, ఎన్జీవోస్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభకనబరుస్తున్న వ్యక్తులకు తెలంగాణ రాష్ట్ర స్థాయి అక్షర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అక్షరఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి తెలిపారు. ఈ పురస్కారాలకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్య, ఉద్యోగ, వైద్య, క్రీడా,సాంస్కృతిక, కళా, సాహిత్య, పర్యావరణ, సాంకేతిక,సామాజిక రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు అర్హులని తెలిపారు. వారు సాధించిన విజయాల పేపర్ కట్టింగ్స్, జిరాక్స్‌లు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు 2, పూర్తి బయోడేటా 16-09-2024 లోపు అక్షర ఫౌండేషన్, ప్లాట్ నెంబర్ 59, జి యం ఆర్ టౌన్ షిప్, కీర్తి నగర్, సూర్యాపేట దరఖాస్తులు పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 9573263625, 9492188878 ను సంప్రదించగలరని కోరారు. అక్షర ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు ఉప్పు నాగయ్య, సోల్లేటి ఉపేంద్రాచారి, సుభాష్ చంద్రబోస్, నెల్లుట్ల పాపయ్య, రుద్రాంగి కాళిదాసు, షేక్ యూసుఫ్, సైదులు, బత్తుల దామోదర్ రెడ్డి, తుంగతుర్తి జనార్ధన చారి, అనుముల వెంకటేశ్వర్లు, షేక్ నజీర్ భాష, గౌరిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

## రైతులందరికీ రుణమాఫీ చేస్తాం

**విశ్వంభర ,కరీంనగర్ బ్యూరో :** రాష్టంలో అర్హత కల్గిన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో సోమవారం పర్యటించారు.. మండలంలో ఇంటివల మరణించిన పలువురి మృతుల కుటుంబాలను పరామర్శించారు. మోడల్‌స్కూల్, ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెల్సుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ..రుణమాఫీ పై కొంత మంది ప్రతిపక్ష నాయకులు సాంకేతిక పరంగా బ్యాంక్‌లలో ఏర్పడిన సమస్యలను అనువుగా చేసుకొని రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని,అలాంటివి మానుకోవాలని అన్నారు. రాష్ట్రంలో వరద సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలతో పంటలు నష్టపోయిన వారందరికీ పరిహారం అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబుఅన్నారు. ప్రతిపక్షాలు రుణమాఫీ పై చేస్తున్న అసత్య ఆరోపణలు నమ్మవద్దన్నారు. సాంకేతిక సమస్యలు, బ్యాంకుల ద్వారా ఇబ్బందులు, ఇతర సమస్యల వల్ల ఇంకా రుణమాఫీ అందని వారికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో త్వరలోనే అందజేస్తామని హామీనిచ్చారు.అధిక వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగితే తాము వెంటనే స్పందించి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేవ్, పార్టీ నేతలు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టమన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ పంట నష్టం పై సర్వే చేసి నివేదిక ఇచ్చిన అనంతరం తగిన పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీకి రోజురోజుకు ప్రజల ఆదరణ తగ్గుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ఖాయమన్నారు. బడుగు, బలహీన వర్గాల నేత మహేష్ గౌడ్ కు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు.

## ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**విశ్వంభర,వనస్థలిపురం:** శశాంక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాల నిర్వహిస్తున్నారు. అధ్యక్షులు రవితేజ మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజల ఆశీస్సులు అండదండలతో ప్రతి సంవత్సరం ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆనంద్, గణేష్, రోహిత్, క్రాంతి, కోటేష్, రంజిత్, వంశీ, మనోజ్, మధు, వినయ్, నాని, పద్మ, వెంకటేష్, గౌతమ్, ఓ ఆర్ కె రణధీర్ రెడ్డి, గౌతం బండి రెడ్డి, అక్షర నేహ తదితరులు పాల్గొన్నారు.



విశ్వంభర, వనస్థలిపురం: సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ఆధ్వర్యంలో 34వ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో గణపతిని 11116 నెమలి ఈకలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ముత్యాల అనిల్ కుమార్ రెడ్డి, పోచంపల్లి గిరిధర్ తడకమల్ల రవికుమార్, ఎర్ర గిన్నెల సురేష్ బాబు, బొల్లెపల్లి సాయి కృష్ణ, సూగురు సతీష్, శివమణి, సంతోష్, కర్ణాకర్, నాగబాబు, నాసిఫ్, సందీప్, సాయికుమార్ సాయి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి విపక్షాలకు ఇవ్వడం ఆనవాయితీ : హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తప్పుబట్టారు. పీఏసీ చైర్మన్ పదవి విపక్షాలకు ఇవ్వడం ఆనవాయితీ అని గుర్తు చేశారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికార పార్టీ నేతను పీఏసీ చైర్మన్‌గా నియమించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ ఇవ్వడం దారుణం. పీఏసీ చైర్మన్ విషయంలో ప్రభుత్వ చర్య అప్రజాస్వామికం. నిత్యం రాజ్యాంగం చేతిలో పట్టుకునే రాహుల్ గాంధీ దీనిపై సమాధానం చెప్పాలి. కేంద్రంలో పీఏసీ చైర్మన్ పదవి ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి వేముల, గంగుల కమలాకర్, రావూరి ప్రకాశ్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రామ్ రావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, భాను ప్రసాద్ రావు, ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ నియామకం అయ్యారు.

## పార్టీ ఫిరాయించిన వారిపై క్రిమినల్ కేసు పెట్టాలి : కూనంనేని సాంబశివరావు



**విశ్వంభర, హైదరాబాద్:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి, క్రిమినల్ కేసులు పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు హైకోర్టు తీర్పుపై ఆయన స్పందించారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాజీనామా చేయకుండా పార్టీ మారితే ప్రజలను మోసం చేసినట్లుగా భావించాన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి వాటికి తావు ఉండకూడదన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామికులపై ఉందన్నారు.

## ములుగు జిల్లాలో పిచ్చి కుక్క స్వైర విహారం 9 మందికి తీవ్ర గాయాలు

**విశ్వంభర, ములుగు :** ములుగు జిల్లాలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. దొరికిన వారిని దొరినట్లు కరిచి బీభత్సం సృష్టించింది. పిచ్చి కుక్క దాడిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరా ల్లోకి వెళ్తే..ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రం పొదుమూరు గ్రామంలో పిచ్చి కుక్క 9 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. గ్రామానికి చెందిన ఎర్రావుల సమ్మయ్య, కొప్పుల లాలయ్య, దాదాని, సైదా మైతున్ బీ, ఘోరే తో పాటు మరోముగ్గురిపై దాడి చేసి కరవగా తీవ్రంగా గాయపడ్డారు.బాధితులను మంగపేట ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. కాగా, గ్రామాల్లో ఇటీవల పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా స్థానిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## చరిత్ర సృష్టించిన ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ అభినందనలు తెలిపిన కేటీఆర్




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో 37 ఏండ్ల క్రితం ఏర్పాటైన ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో ఎప్పుడూ అగ్రభాగాన నిలుస్తోంది. ఎన్నో రకాల కంటి సమస్యలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి కీర్తి గడించింది. ఇక 50 వేల కార్నియల్ ట్రాన్స్‌ప్లాంట్లు పూర్తి చేసి ప్రపంచంలోనే మొదటి ఇన్‌స్టిట్యూట్‌గా ఎల్వీ ప్రసాద్ చరిత్ర సృష్టించింది.ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలుపుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వర్ రావు, ఆయన బృందానికి కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.హైదరాబాద్‌లో 1987లో తమ మొదటి కంటి ఆస్పత్రిని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎల్వీ ప్రసాద్ సంస్థ ప్రధానంగా సమానత్వం, సమర్థత,శ్రేష్ఠత అనే విలువలను అనుసరిస్తుంది. ఇక్కడ పేద, ధనిక అన్న తేడా లేకుండా రోగులందరినీ సమానంగా చూస్తారు. సమర్థత విషయానికొస్తే అత్యుత్తమ వైద్య పరికరాలు, అధునాతన టెక్నాలజీతో కూడిన ఉత్తమ వైద్య సేవలు ఇక్కడ అందుతాయి.

# పంత్ అత్యుత్తమ టెస్టు ఆటగాడు : గంగూలీ



**న్యూఢిల్లీ:** భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ మళ్లీ టెస్టు జెర్సీ వేసుకోబోతున్నాడు. కారు యాక్సిడెంట్ కారణంగా ఏడాదిన్నర తర్వాత టెస్టు జట్టుకి ఎంపికైన అతడు బంగ్లాదేశ్‌పై సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. ఇక సుదీర్ఘ ఫార్మాట్‌లో ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల పంత్‌పై మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ (Souarav Ganguly) ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నా దృష్టిలో పంత్ టెస్టుల్లో అత్యుత్తమ ఆటగాడు' అని దాదా అన్నాడు.'నా దృష్టిలో భారత అత్యుత్తమ టెస్టు ఆటగాడు పంత్. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు నిజంగా ఆల్‌టైమ్ గ్రేట్. అయితే.. అతడు గతంలో మాదిరిగా తన దూకుడును కొనసాగిస్తేనే బెస్ట్ బ్యాటర్ అవుతాడు. ఇక.. పంత్ వన్డేల్లో, టీ20ల్లో మరింత మెరుగవ్వాల్సి ఉంది. అతడిలో చాలా ప్రతిభ ఉంద. రాబోయే రోజుల్లో పంత్ భారత దేశపు అత్యుత్తమ ఆటగాడు అవుతాడని నా ప్రగాఢ నమ్మకం' అని గంగూలీ తెలిపాడు. అంతేకాదు బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ఎంపికైన స్క్వాడ్‌లో ప్రధాన పేసర్ షమీ లేకపోవడంపై దాదా స్పందించాడు.

'గాయం నుంచి కోలుకుంటున్న షమీ బంగ్లా సిరీస్‌కు దూరం అయ్యాడనేది నాకు తెలుసు. అయితే.. అతడు త్వరలోనే జట్టులోకి వస్తాడు. ఎలాగూ ఆస్ట్రేలియా పర్యటన ఉందిగా. షమీ జట్టుతో కలిస్తే పేస్ బౌలింగ్ యూనిట్ ప్రమాదకరంగా మారుతుంది. ఇక బెంగాల్ పేసర్ ఆకాశ్ దీప్ విషయానికొస్తే.. అతడొక అద్భుతమైన యువ పేసర్. వేగంగానే కాదు ఎక్కువ స్పెల్స్ బౌలింగ్ చేయగల సత్తా అతడికి ఉంది.అతడు బెంగాల్ తరపున ఆడడం.. వికెట్లు తీయడం నేను చూశాను. సిరాజ్, షమీల మాదిరగానే ఆకాశ్ కూడా 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగలడు' అని గంగూలీ వెల్లడించాడు. భారత జట్టు గొప్ప కెప్టెన్లలో ఒకడైన గూంగూలీ వీడ్కోలు అనంతరం బీసీసీఐ అధ్యక్షుడిగా సేవలందించాడు. ప్రస్తుతం దాదా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి డెరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా కొనసాగుతున్నాడు. ఇదే జట్టుకు రిషభ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

## ఒలింపిక్స్‌కు సిద్ధం కావాల్సింది

### వినేశ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నా: మహవీర్ ఫొగాట్




**విశ్వంభర, క్రీడా విభాగం :** పారిస్ ఒలింపిక్స్‌లో పతకం కోల్పోయిన వినేశ్ ఫొగాట్ రాజకీయాల్లోకి రావడంపై సర్వత్రా చర్చ జరుగతోంది. కుస్తీని వదిలేసిన ఆమె ఈమధ్యే కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆమె నిర్ణయాన్ని తోటి రెజ్లర్లు కొందరు తప్పు పడుతున్నారు. తాజాగా ఆమె మేనమామ మహవీర్ ఫొగాట్ సైతం అదే అభిప్రాయం వెలిబుచ్చాడు. నాలుగేండ్ల తర్వాత లాస్ ఏంజెలస్‌లో జరుగబోయే ఒలింపిక్ పతకంపై వినేశ్ గురి పెట్టాల్సింది. అలాకాకుండా ఆమె రాజకీయాల్లోకి రావడాన్ని నేను వ్యతిరేకిస్తున్నా అని మహవీర్ అన్నాడు. 'వినేశ్ తీసుకున్ని నిర్ణయం నాకు నచ్చడం లేదు. ఆమె ఒలింపిక్ పతకంపై గురి పెట్టాల్సింది. ఈ తరం పిల్లలు సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అయితే.. అది వాళ్ల అభీష్టం. నా బాధ్యత ఏంటంటే.. వాళ్లకు మంచి తర్ఫీదు ఇవ్వడమే. ప్రస్తుతం వినేశ్ ఫొగాట్ వయసు చూస్తే.. మరో ఒలింపిక్స్‌కు సిద్ధం కావాల్సింది. అందుకని వినేశ్ రాజకీయాల్లోకి రావడాన్ని నేను వ్యతిరేకిస్తున్నా' అని మహవీర్ తెలిపాడు.అంతేకాదు బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా వినేశ్ మళ్లీ ఆందోళన చేపట్టనుందా? అనే ప్రశ్నకు ఆయన .. ఆ ఉద్యమం అనేది ఒక వ్యక్తికి సంబంధించినది. అయితే.. అందుకు రాజకీయాలతో పని లేదు అని ఆయన స్పష్టం చేశారు. వినేశ్‌ను ఒలింపిక్ చాంపియన్‌గా చూడాలనే తన కల ఇక నెరవేరదనే బాధ మహవీర్‌లో కనిపిస్తోంది.

## వినేశ్ ఫోగట్, భజరంగ్ పూనియా రాజీనామాలు ఆమోదించిన రైల్వేశాఖ

**న్యూఢిల్లీ:** రెజ్లర్లు వినేశ్ ఫోగట్ , భజరంగ్ పూనియాలు తమ రైల్వే ఉద్యోగాలకు రాజీనామా చేశారు. అయితే ఆ రాజీనామాలను ఆమోదించినట్లు రైల్వేశాఖ ఇవాళ తెలిపింది. ఈ ఇద్దరు రెజ్లర్లు కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఆ ఇద్దరూ హర్యానాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడే అవకాశాలు ఉన్నాయి. రాజీనామాకు ముందు ఇవ్వాల్సిన మూడు నెలల నోటీస్ పీరియడ్‌ను ఎత్తివేసినట్లు రైల్వేశాఖ తెలిపింది. జులానా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వినేశ్ ఫోగల్ .. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడనున్నారు. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడం వల్ల .. సర్వీస్ రూల్స్ ప్రకారం నోటీసులు ఇచ్చినట్లు ఉత్తర రైల్వేశాఖ తెలిపింది. ఆ నోటీసు ఇచ్చిన తర్వాతనే.. ఇద్దరు రెజ్లర్లు తమ రైల్వే ఉద్యోగాలకు రాజీనామా సమర్పించారు. బీజేపీ ఎంపీ , రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా వినేశ్ ఫోగల్, భజరంగ్ పూనియాలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.గత నెలలో ముగిసిన పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో.. వినేశ్ ఫోగట్ తన క్యాటగిరిలో అనర్హతకు గురైంది. వంద గ్రాముల అధిక బరువు ఉన్న కారణంగా.. ఫైనల్ మ్యాచ్‌కు ముందు ఆమెపై అనర్హత వేటు వేశారు. ఆ తర్వాత ఆమె రెజ్లింగ్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు.

# ఒలింపిక్స్‌కు అర్హత సాధించాకే నన్ను విమర్శించండి..





### విమర్శకులకు సైనా కౌంటర్

**విశ్వంభర (క్రీడా విభాగం):** ఒలింపిక్ విజేతగా ఓ వెలుగు వెలిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఈ మధ్య తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఆరేండ్లుగా అంతర్జాతీయ పోటీలకు దూరమైన సైనా తాను ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్నాని ఈమధ్యే చెప్పింది. అంతకంటే ముందు 'భారత్‌లో క్రికెట్‌కు ఉన్న ఆదరణ చూస్తే అసూయ వేస్తోంది' అంటూ ఆమె విమర్శల పాలైంది. అప్పటి నుంచి ఎవరోఒకరు సైనాను సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఈమధ్య కొందరు సైనా నెహ్వాల్ ప్రతిభను, కష్టాన్ని తక్కువ చేస్తూ మాట్లాడతున్నారు. పారిస్ ఒలింపిక్స్ సమయంలో కొందరు 2012 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం ఆమెకు అదృష్టవశాత్తూ.. బహుమతిగా దొరికిందంటూ సోషల్ మీడియాలో పిచ్చి పిచ్చి కామెంట్లు పెడతున్నారు. దాంతో, చిర్రెత్తుకొచ్చిన సైనా వాళ్లకు గట్టిగా బుద్ధి చెప్పాలనుకుంది. 'ముందుగా ఒలింపిక్స్ పోటీలకు అర్హత సాధించండి. ఆ తర్వాత నన్ను విమర్శించండి' అంటూ ఆమె సవాల్ విసిరింది. సైనా నుంచి ఊహించని స్పందన రావడంతో విమర్శకుల నోళ్లకు తాళం పడినట్టు అయింది.

దాదాపు ఆరేండ్లుగా ఆటకు దూరమైన సైనా ఈ మధ్య రాష్ట్రపతి భవన్‌లో ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ముతో సరదాగా బ్యాడ్మింటన్ ఆడింది. అనంతరం 'మై స్టోరీ - హర్ స్టోరీ' సిరీస్‌లో ఆమె పలు విషయాలు మాట్లాడింది. అయితే.. క్రికెట్‌పై ఆమె చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. బ్యాడ్మింటన్ బదులు టెన్నిస్ ఆడి ఉంటే బాగుండు అని తనకు అప్పుడప్పుడు అనిపించేదని సైనా అంది.అంతేకాదు 'టెన్నిస్, బ్యాడ్మింటన్ కంటే క్రికెట్ ఏమంత కష్టమేమీ కాదు. మనదేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ చూస్తే అసూయ వేస్తుంది. ఎందుకంటే.. క్రికెట్‌కు మాత్రమే క్రేజ్ ఉంటే భారత్ క్రీడా దేశం ఎలా అవుతుంది?. ఒలింపిక్స్‌లో చైనాతో పోటీ పడి పతకాలు ఎలా గెలవగలం' అని అంది.

## యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచిన సిన్నర్..

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను జాన్నిక్ సిన్నర్ గెలిచాడు. ఫైనల్లో అతను టేలర్ ఫ్రిట్జ్‌పై 63, 64,75 స్కోరు తేడాతో విజయం సాధించాడు. నెంబర్ వన్ ర్యాంక్ ప్లేయర్ సిన్నర్.. తన బేస్‌లైన్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. ఇటీవల డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలినట్లు సిన్నర్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. 23 ఏళ్ల ఇటలీ ప్లేయర్ సిన్నర్.. తన కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ సాధించాడు. ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ కూడా గెలిచాడతను. యూఎస్ ఓపెన్‌లో అమెరికా టెన్నిస్ ప్లేయర్ టైటిల్ గెలిచే అవకాశాన్ని సిన్నర్ అడ్డుకున్నాడు. 21 ఏళ్లుగా యూఎస్ ఓపెన్‌లో అమెరికా ప్లేయర్‌కు టైటిల్ దక్కలేదు.

### డోపింగ్ వివాదం..

యూఎస్ ఓపెన్ టోర్నీకి ఆరు రోజుల ముందు మాత్రమే సిన్నర్‌కు డోపింగ్ పరీక్ష నుంచి క్లియరెన్స్ దక్కింది. రెండు సార్లు జరిపిన పరీక్షల్లో అతనికి స్వల్ప స్థాయిలో క్లోస్టెబోల్ స్టిరాయిడ్ ఉన్నట్లు తేలింది. ఫిజియోథెరపిస్ట్ అనుకోకుండా ఇవ్వడం వల్ల సిన్నర్‌లో స్టిరాయిడ్ ఉన్నట్లు తెలిసిందని ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ పేర్కొన్నది. యూఎస్ ఓపెన్ టైటిల్ తనకు ఎంతో ముఖ్యమైందని, ఎందుకంటే కెరీర్‌లో గడిచిన కొన్ని రోజులు కష్టంగా సాగినట్లు సిన్నర్ తెలిపాడు. టోర్నీ ఆడుతున్న సమయంలో డోప్ పరీక్షలకు చెందిన ఆలోచనలే వచ్చేవన్నారు.

డోపింగ్ వివాదం తర్వాత ఫిజియో, ఫిట్‌నెస్ ట్రైనర్ నుంచి సిన్నర్ దూరం అయ్యాడు. ఆ ఇద్దర్నీ వదులుకున్నాడు. టెన్నిస్ క్రీడల్లో బిగ్ ఫోర్‌గా పిలిచే రోజర్ ఫెదరర్, రఫేల్ నాదల్, జోకోవిడ్, ముర్రే లేకుండానే ఈ ఏడాది యూఎస్ ఓపెన్ ముగిసింది. 2002 తర్వాత ఈ నలుగురు లేకుండా గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలవడం ఇదే మొదటిసారి. అయితే ఈ ఏడాది సిన్నర్, అల్కరాజ్‌లు చెరో రెండు గ్రాండ్‌స్లామ్‌లు సొంతం చేసుకున్నారు.




# టెస్టుల్లో సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్న రాహుల్




**విశ్వంభర (క్రీడా విభాగం):** భారత స్టార్ ఆటగాడు కేఎల్ రాహుల్ టెస్టుల్లో సత్తా చాటేందుకు ఎదురు చూస్తున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు స్క్వాడ్‌లో ఒకడైన రాహుల్ ఈసారి తన స్థానం పదిలం చేసుకోవడమే లక్ష్యంగా ఆడనున్నాడు. తాజాగా దులీప్ ట్రోఫీలో ఇండియా ఏ తరఫున అర్ధ శతకం బాదడం కూడా ఈ సొగసరి ఆటగాడికి కలిసి రానుంది. అయితే.. బంగ్లాదేశ్ టెస్టులో రాహుల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపుతారనే వార్తలు వినిపిస్తున్నాయి.ఐదో స్థానంలో మంచి ట్రాక్ రికార్డు ఉన్న అతడిని మళ్లీ అదే స్థానంలో పంపాలని మేనేజ్‌మెంట్ భావిస్తుందని టాక్. అదే జరిగితే.. డాషింగ్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఆరో స్థానంలో ఆడాల్సి వస్తుంది. రాహుల్ గత మూడు మ్యాచుల్లో ఓ సెంచరీ కొట్టాడు. అది కూడా దక్షిణాఫ్రికాపై. ఈ మధ్య అతడు ఆడిన గొప్ప ఇన్నింగ్స్‌ల్లో అదొకటి. ఇక గాయపడడానికి ముందు ఉప్పల్ టెస్టులో 86 పరుగులతో రాణించాడు. అయితే.. అతడిపై వేటు వేయలేదు. గాయం వల్ల జట్టుకు దూరమయ్యాడంతే.తాజాగా దులీప్ ట్రోఫీలో రాహుల్ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఇక సర్ఫరాజ్ విషయానికొస్తే.. అతడు చాలా గొప్పగా ఆడుతున్నాడు. ఎవరికైనా గాయమైతే అతడు ఆడడం పక్కా. అయితే.. జట్టు మేనేజ్‌మెంట్ బంగ్లాదేశ్ సిరీస్ ఒక్కటే చూడడం లేదు. ఆస్ట్రేలియా సిరీస్‌ను దృష్టిలో పెట్టుకొని గతంలో ఆడిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటోంది అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అంతేకాదు కారు యాక్సిడెంట్ తర్వాత జట్టులోకి వచ్చిన రిషభ్ పంత్ తుది జట్టులో ఉండడం ఖాయం అనిపిస్తోంది.

గతంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లపై చెలరేగిన పంత్ భారత జట్టు చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడు. అందుకని రాంచీ టెస్టు హీరో ధ్రువ్ జురెల్‌కు నిరీక్షణ తప్పకపోవచ్చు. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య సెప్టెంబర్ 19న తొలి టెస్టు జరుగనుంది. అనంతరం సెప్టెంబర్ 27 కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియంలో రెండో టెస్టు నిర్వహించనున్నారు.

భారత స్క్వాడ్ : రోహిత్ శర్మ(కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ఆకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్.

## నిశాంక శతకమోత..

### మూడో టెస్టులో లంక అద్భుత విజయం



**కెన్సింగ్‌టన్ ఓవల్:** మూడో టెస్టులో శ్రీలంక అద్భుత విజయం సాధించింది. వరుసగా రెండు టెస్టుల్లో ఓటమిని దిగమింగి భారీ విజయంతో ఇంగ్లండ్‌కు షాకిచ్చింది. కెన్సింగ్‌టన్ ఓవల్‌లో ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న పథుమ్ నిశాంక (127 నాటౌట్: 124 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకంతో గర్జించాడు. సీనియర్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్(32 నాటౌట్) పట్టువదలని విక్రమార్కుల్లా పోరాడాడు. దాంతో, తొలి రెండు టెస్టుల్లో ఓటమికి లంక బదులు తీర్చుకుంది. 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించి సిరీస్‌లో బోణీ కొట్టింది.ఇంగ్లండ్ పర్యటనలో శ్రీలంక వైట్‌వాష్ తప్పించుకుంది. తొలి రెండు మ్యాచుల్లో కనీస పోటీ ఇవ్వలేకపోయిన లంక మూడో మ్యాచ్‌లో చెలరేగింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. మూడు విభాగాల్లో ఆతిథ్య జట్టును తోసిరాజని సంచలన విజయం నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ను 325కే కట్టడి చేసిన లంక.. రెండో ఇన్నింగ్స్‌లో పంజా విసిరింది. ఆతిథ్య జట్టును 156 పరుగులకే ఆలౌట్ చేసింది. లహిరు కుమార(4/21), విశ్వ ఫెర్నాండో(3/40)లు సూపర్ స్పెల్‌తో ఇంగ్లండ్ బ్యాటర్ల ఆట కట్టించారు. దాంతో, లంక మ్యాచ్‌పై పట్టు బిగించింది.స్వల్ప ఛేదనలో లంక ఓపెనర్ పథుమ్ నిశాంక(127 నాటౌట్: 124 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్లు) సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. కుశాల్ మెండిస్(39), ఏంజెలో మాథ్యూస్(32 నాటౌట్)తో కలిసి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. తొలి రెండు టెస్టుల్లో గెలుపొందిన ఇంగ్లండ్ 21తో సిరీస్ కైవసం చేసుకుంది. అద్భుత శతకంతో లంకను గెలిపించిన పథుమ్ నిశాంక 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. లార్డ్స్ టెస్టులో రెండు సెంచరీలతో చెలరేగిన జో రూట్, కమిందు మెండిస్‌లు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నారు.

# భారత పురుషుల హాకీ జట్టు జైత్రయాత్ర

### ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో రెండో విజయం



**విశ్వంభర (క్రీడా విభాగం):** ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్యంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల హాకీ జట్టు జైత్రయాత్ర కొనసాగిస్తోంది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో చైనాను మట్టికరిపించిన బోణీ కొట్టి రోజైనా గడువలేదు.. 'మెన్ ఇన్ బ్లూ' జట్టు మరో విజయాన్ని రుచి చూసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జపాన్‌పై టీమిండియా ఘన విజయం సాధించింది.విశ్వ క్రీడల్లో పతక విజేతగా ఆడుతున్న తొలి టోర్నీలో టీమిండియా పంజా విసురుతోంది. వరుస పెట్టి ప్రత్యర్థులను ఓడిస్తూ వస్తోంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ ఆరంభ పోరులో 30తో చైనాకు చెక్ పెట్టింది. ఇక జపాన్‌పై కూడా హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం అదే జోరు కనబరిచింది. అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థి ఆటగాళ్ల ఎత్తులను చిత్తు చేసి.. 51తో జయభేరి మోగించింది.




## తడిసిముద్దైన స్టేడియం.. ఒక్క బంతి పడకుండానే మ్యాచ్ రద్దు



**నోయిడా:** ఏకైక టెస్టుకోసం భారత్‌లో అడుగుపెట్టిన న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్ జట్లకు పెద్ద షాక్. ఒక్క బంతి కూడా పడకుండానే తొలి రోజు ఆట రద్దయ్యింది. భారీ వర్షాల కారణంగా గ్రేటర్ నోయిడాలోని స్టేడియం తడిసిముద్దైంది. ఔట్ ఫీల్డ్ పూర్తిగా తడిగా ఉండడంతో అంపైర్లు టాస్ వేయకుండానే తొఒలి రోజు ఆటను రద్దు చేశారు. దాంతో, రెండో రోజు ఔట్ ఫీల్డ్ పొడిగా మారితే షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటలకు మ్యాచ్ మొదలవ్వనుంది.తాలిబాన్ల రాజ్యం ఏర్పడ్డాక అఫ్గనిస్థాన్‌లో క్రికెట్‌కు ప్రోత్సాహం కరువైంది. అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహిణకు అనువైన స్టేడియాలు అఫ్గన్‌లో లేవు. అందుకనే న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరగాల్సిన ఏకైక టెస్టు కోసం అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు.. బీసీసీఐని ఆశ్రయించింది. అందుకు బీసీసీఐ పచ్చ జెండా ఊపింది. దాంతో, కివీస్, అఫ్గన్ జట్లు గ్రేటర్ నోయిడా చేరుకున్నాయి.కానీ, గత వారం రోజులగా కురుస్తున్న వర్షాల కారణంగా స్టేడియమంతా నీళ్లతో నిండింది. సోమవారం వాన లేకున్నా సరే ఔట్‌ఫీల్డ్ తడిగానే ఉండడంతో సిబ్బంది సూపర్ సాపర్స్ ద్వారా నీటిని తోడేశారు. అయినా సరే ఔట్ ఫీల్డ్ పూర్తిగా సిద్ధమవ్వలేదు. దాంతో, అంపైర్లు మ్యాచ్ నిర్వహించేందుకు ఆసక్తి చూపలేదు.

# తొలి ట్రిలియనీర్ కానున్న ఎలన్ మస్క్ !.. రేసులో గౌతం అదానీ





**న్యూయార్క్:** స్పేస్ ఎక్స్, టెస్లా కంపెనీ సీఈవో ఎలన్ మస్క్.. ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా నిలవనున్నారు. 2027 నాటికి ఆయన ట్రిలియన్ డాలర్లు కలిగిన వ్యక్తిగా రికార్డుల్లోకి ఎక్కనున్నట్లు ఇన్‌ఫార్మా కనెక్ట్ అకాడమీ తెలిపింది. ప్రతి ఏడాది మస్క్ ఆదాయం పెరుగుతున్న గణాంకాల ఆధారంగా ఈ అంచనా వేశారు. మస్క్ వార్షిక సంపద వృద్ధి సుమారు 109.88గా ఉన్నట్లు భావిస్తున్నారు. సోషల్ మీడియా ఎక్స్ ఓనర్ అయిన మస్క్.. ప్రస్తుతం 237 బిలియన్ల డాలర్లతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా మొదటి స్థానంలో నిలిచారు. ఇప్పటి వరకు మస్క్ .. ఆరు కంపెనీలకు ఫౌండర్‌గా ఉన్నారు. ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా, స్పేస్ ఎక్స్ దీంట్లో ఉన్నాయి. టెస్లా కంపెనీ మార్కెట్ విలువ 669.28 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఆ కంపెనీ విలువ ట్రిలియన్ డాలర్లకు వచ్చే ఏడాది చేరే అవకాశాలు ఉన్నాయి.ప్రపంచ సంపన్నుల్లో ట్రిలియనీర్లు కాబోనున్న ఇతర వ్యాపారవేత్తలను కూడా అంచనా వేశారు. ట్రిలియనీర్ క్లబ్‌లో చేరనున్న వారిలో భారతీయ వ్యాపారి గౌతమ్ అదానీ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ జాబితాలో ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హువాంగ్, ఇండోనేషియా మ్యాగ్నెట్ ప్రజోగో పంగెస్టు కూడా ఉన్నారు. 2028 వరకు ఈ ముగ్గురూ ట్రిలియనీర్లు అయ్యే ఛాన్సు ఉన్నట్లు ఇన్‌ఫార్మా కనెక్ట్ అంచనా వేసింది. ఫ్రెంచ్ వ్యాపారవేత్త, లూయిస్ విట్టాన్ ఓనర్ బెర్నార్డ్ అర్నాల్ట్.. 2030 వరకు ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.

ఎలన్ మస్క్ తొలి సారి ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో 2012లో కనిపించారు. అప్పుడు ఆయన ఆస్తి రెండు బిలియన్ల డాలర్లు. 2021లో తొలిసారి ఆయన ప్రపంచ కుబేరుల్లో బేజోస్‌ను వెనక్కి నెట్టి ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాడు. 2022 డిసెంబర్‌లో ఆయన కొన్నాళ్లు ఆ స్థానాన్ని కోల్పోయారు. మళ్లీ ఆర్నెళ్ల తర్వాత ఫస్ట్ ప్లేస్ కొట్టేశాడు.

# ఇన్ఫీలో ఇన్ సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు..

### 16 సంస్థలపై ఆంక్షలు ఎత్తేసిన సెబీ..!




**విశ్వంభర (బిజినెస్):** ఇన్ఫోసిస్ ఇన్ సైడర్ ట్రేడింగ్ కేసులో స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' కీలక నిర్ణయం తీసుకున్నది. ఇన్ఫోసిస్ మాజీ ఉద్యోగులు సహా 16 సంస్థలపై ఇంతకు ముందు విధించిన ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. అమిత్ భుత్రా, భారత్ సీ జైన్, క్యాపిటల్ వన్ పార్టనర్స్, టెసోరా క్యాపిటల్, మనీష్ సీ జైన్, అంక్రుష్ భుత్రాలతో కూడిన ఆరు సంస్థలపై విధించిన నిషేధం ఎత్తేస్తున్నట్లు తెలిపింది. 2019 డిసెంబర్ నుంచి 2020 సెప్టెంబర్ వరకూ నాలుగు త్రైమాసికాల కాలంలో 'అనుమానాస్పద ట్రేడింగ్' జరిగినట్లు సెబీ గుర్తించిన తర్వాత 16 సంస్థల ట్రేడింగ్ మీద ఆంక్షలు విధించింది. సంబంధిత సంస్థలపై ఆరోపణలకు సరైన సాక్షాధారాలు లభించక పోవడంతోపాటు 2022 ఏప్రిల్ 25 నాటి 'శాట్' ఆదేశాలకు అనుగుణంగా ఆంక్షలు ఎత్తేస్తున్నట్లు సెబీ వెల్లడించింది.



## ప్రేమ వ్యవహారంపై
# ఓపెన్ అయిన తమన్నా

**విశ్వంభర, సినిమా :** మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా.. ఆమె గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేదు.సౌత్ ఇండస్ట్రీలో అత్యధిక డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఈ బ్యూటీ ఒకరు. ఆమె తెలుగుతో పాటు తమిళం, హిందీ ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. మంచు మనోజ్ హీరోగా వచ్చిన 'శ్రీ' అనే మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ అమ్మడు ఆ తరువాత శేఖర్ కమలా డైరెక్షన్ లో వచ్చిన 'హ్యాపీ డేస్' అనే మూవీతో స్టార్ హీరోయిన్ గా మారింది. ఈ హిట్ తో ఎక్కడ కూడా వెనక్కి తిరిగి చూసుకోకుండా ఇండస్ట్రీలో దూసుకుపోయింది. ఇటీవల డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వంలో వచ్చిన బాక్ మూవీలో నటించింది. ఇక తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన జైలర్ మూవీలో 'కావాలయ్యా..'అంటూ రెచ్చిపోయి.. గ్లామర్ షో లో టాక్ ఆఫ్ దీ సెన్సేషన్ గా మారింది ఈ మిల్కీ బ్యూటీ. ఈ మధ్యనే స్త్రీ 2 సినిమాలో కూడా ఓ ఐటమ్ సాంగ్ నటించి కుర్రకారును చెమటలు పట్టించింది.

తమన్నా పర్సనల్ లైఫ్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా సాగుతుంది. గతేడాదిగా ఈ బ్యూటీ ఓ బాలీవుడ్ స్టార్ హీరో నటుడు విజయ్ వర్మతో లవ్ ట్రాక్ నడుపుతోందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరిద్దరు త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని బాలీవుడ్ మీడియాలో పలు హాట్ స్టోరీస్ సర్కులేట్ అవుతున్నాయి. కానీ, ప్రస్తుతం తనకు మ్యారేజ్ చేసుకునే మూడ్‌లో లేదంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది.

ఇదిలా ఉంటే.. తాజాగా మరో ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. తన జీవితంలో రిలేషన్ షిప్ లో కొన్ని చేదు అనుభవాలు ఎదుర్కొన్నానని చెప్పుకొచ్చింది. తాను టీనేజ్ లో ఉన్నప్పుడే తొలిసారి ప్రేమలో పడ్డానని, కానీ కొన్ని కారణాలతో ఆ లవ్ బ్రేకప్ అయ్యిందనీ, తన లైఫ్ లో తన హృదయం రెండుసార్లు బ్రేకప్ జరిగిందని తెలిపింది. తొలిసారి ఒక వ్యక్తి కోసం తనకు నచ్చిన జీవితాన్ని వదులుకోవడం నచ్చలేదనీ, జీవితంలో ఏదో సాధించాలని, కొత్త విషయాలు అన్వేషించాలని భావించాననీ, ఆ కారణంగానే తొలి బంధం నిలువలేదని చెప్పుకొచ్చారు. కొన్ని రోజుల తరువాత మరో వ్యక్తితో రిలేషన్ షిప్ లో ఉన్నాననీ, కానీ అతడు నాకు కరెక్ట్ కాదనిపించిందన్నారు. అలాంటి వ్యక్తితో బంధమంటే ప్రమాదమని అర్థమైందనీ, అలా రెండో సారి తన హృదయం ముక్కలైందని చెప్పుకొచ్చింది.

## తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ ఎన్నిక

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ 202426 సంవత్సరానికి నూతన కమిటీ ఏకగ్రీవం ఎన్నికైంది. నూతన కార్యవర్గ సమావేశం ఫిల్మ్ నగర్ లోని వారి కార్యాలయం లో జరిగింది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ నూతన చైర్మన్ గా పతాని రామక్రిష్ణ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ లుగా ఏ. గురురాజ్, డీ. కోటేశ్వరరావు, జీ.వీఎన్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్, జనరల్ సెక్రటరీస్ గా డా. కాచం సత్యనారాయణ, జే. వెంకటేశ్వర రావు, జే. టీ విద్యాసాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అశోక్ కుమార్ పినిశెట్టి, పి వర ప్రసాదరావు, వై శ్రీనివాసరావు రావు, జాయింట్ సెక్రటరీలు బి సోమిరెడ్డి, ఎం. బిందు, ట్రెసరర్ డాక్టర్ పి రమేష్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ అనూష పాశం, పి సందీప్, సి విట్టల్ గౌడ్, కే తులసి, టి గంగాధర్, శ్రీకాంత్ బాబు, ఉమాపతి, పి రాజశేఖర్ రెడ్డి, వెంకటేష్, వెంకట చారి, ఏ శ్రీధర్ గౌడ్ జనగాం, రమేష్ గుప్తా సిద్దిపేట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



# విడాకులు తీసుకున్న మరో స్టార్ హీరో..



**విశ్వంభర, సినిమా :** కోలీవుడ్ స్టార్ హీరో జయం రవి తాజాగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సంచలన ప్రకటన చేసి, అభిమానులకు షాకిచ్చారు. తన భార్య ఆర్తితో విడాకులు తీసుకున్నట్లు ప్రకటించారు. అయితే, గత కొన్ని రోజులుగా ఈ దంపతులు విడాకులు తీసుకోబోతున్నట్లు నెట్టింట వార్తలు హల్‌చల్ చేశాయి. ఇప్పుడు వాటినే నిజం చేస్తూ జయం రవి సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు.

అలాగే తాము పరస్పర అంగీకారంతోనే విడాకులు తీసుకుంటున్నట్లు ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఇక ఈ జంట 2009లో పెళ్లి బంధంలోకి అడుగుపెట్టింది. దాదాపు 15 ఏళ్ల పాటు రవి, ఆర్తి తమ వైవాహిక జీవితాన్ని గడిపారు. ఈ దంపతలకు ఆరవ్, అయాన్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

'ఎక్స్'లో జయం రవి పోస్ట్ చేసిన లేఖలో ఏముందంటే..

"జీవితం చాలా అధ్యాయాలతో నిండిన ఒక ప్రయాణంలాంటిది. ఇందులో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మీలో చాలామంది నన్ను ఆదరించారు. అలాగే నాకు సపోర్ట్ కూడా చేశారు. అందుకే నేనెప్పుడు నా ఫ్యాన్స్, మీడియాతో నిజాయతీగా ఉంటాను.

ఈ నేపథ్యంలోనే ఇవాళ మీతో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకుంటున్నాను. భారమైన హృదయంతో ఈ విషయాన్ని మీకు చెప్పాల్సి వస్తోంది. ఎన్నో ఆలోచనలు, చర్చల తర్వాత నేను, నా భార్య ఆర్తి డైవోర్స్ తీసుకోవాలనే కఠినమైన నిర్ణయానికి వచ్చాం.

మేము పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. మా ఇద్దరి భవిష్యత్ కోసమే కోసమే ఇలా చేయాల్సి వస్తోంది. ఈ సమయంలో మాతో పాటు మా కుటుంబసభ్యుల వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని మీ అందరినీ కోరుతున్నాను. ఈ విషయంపై పుకార్లు, ఆరోపణలు మానేయాలని మనవి చేస్తున్నాను. ఇది పూర్తిగా మా వ్యక్తిగత విషయం.

నేను సినిమాల్లో నటిస్తూనే ఉంటాను. చిత్రాల విషయంలో నా ప్రాధాన్యం ఎప్పుడూ ఇలాగే కొనసాగుతుంది. మీ అందరికీ వినోదాన్ని పంచడం కోసం నేను ఎప్పుడూ కష్టపడుతూనే ఉంటాను. ఎప్పటికీ మీ జయం రవిగా మీ గుండెల్లో ఉంటాను. నన్ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు చాలా కృతజ్ఞతలు. నాకు ఇకపై కూడా మీరు ఇలానే మద్దతుగా ఉంటారని ఆశిస్తున్నాను" అంటూ జయం రవి తన లేఖలో పేర్కొన్నారు.


వైశ్య వికాస వేదిక
Last Date for Application 12th September 2024
FOR APPLY ONLINE SCAN HERE
సెప్టెంబర్ - 5
సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి మరియు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం
పురస్కరించుకొని గత 5 సం॥లుగా వైశ్య వికాస వేదిక
ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుతున్న
తెలంగాణ వైశ్య ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు
గురుపూజోత్సవ కార్యక్రమం
2024లో కూడా నిర్వహిస్తున్నాము. కావున ఆసక్తి గలవారు
https://vysyavikasavedika.com
వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోగలరు.
డా॥ కాచం సత్యనారాయణ గుప్త
M.A,MSW,PGDCJ,LLB
ఫౌండర్ చైర్మన్ - వైశ్య వికాస వేదిక
Cell: 9441222429
మరిన్ని వివరాలకు: కాచం సాయి - 8885402108, నంగునూరి రమేష్ - 9866012985



Project By GNR
ANVAYA
Premium luxury villa
KONGARAKALAN
Creating A Beautiful Home For You And Your Family
Marketed By South Icon Group
NO Pre EMI's UPTO 24 Months
PRICE 5499/- Per Sft
200 Yards@ 1.5 Cr
400 Yards @ 2.5 Cr
hmda
80% Loan Available From All Leading Banks



52,000 sqft Iconic Club House With Forest View
30 Ac Area Villa Project With 320 Premium Luxury Villas
Evergreen Surroundings for A Life Time Beside Forest

AMENITIES
- Gym
- Aerobics
- Indoor Games
- Olympiad Size Swimming pool,
- Badminton court
- Squash Court
- Banquet halls
- Multi-purpose & conference hall
- Creche
- Spa and Saloon
- Bar and Lounge
- Supermarket
- Canteen
- Clinic
- Billiards pool table
- Library

LOCATION HIGHLIGHTS
- 28 ACRES BIGGEST GATED COMMUNITY BT ROAD FACING LAYOUT
- 30 MIN DRIVE FROM KOKAPET/FINANCIAL DISTRICT THROUGH TSPA JUNCTION
- PROXIMITY TO 19000 ACERS PHARMA CITY
- PROXIMITY TO TCS ADIBATLA, AEROSPACE AND FABCITY.
- PROXIMITY TO EDUCATIONAL INSTITUTIONS
- 30 MIN DRIVE FROM HI-TECH CITY, GACHIBOWLI
- 15MIN DRIVE FROM RGIA AIRPORT

South Icon Group
Corp Office : Plot No. 63P & 62 (NP) 3rd Floor, Samatha nagar Nagole 'X' Roads, Hyderabad - 500 068.
CONTACT FOR MORE DETAILS
9652167668



STUDENT VISA ASSISTANCE



BP TECH
INDIA, USA
- Training By Real Time Experience
- Hands on Based Training
- Job Assistance
- Personality Development

.NET
Java
python
DevOps
Power BI
Selenium
SOFTWARE TESTING
aws
FIRST TIME IN NAGOLE
Address: Plot No.63P % 62 (NP) 2nd Floor, Samatha Nagar, Nagole X Road, Hyderabad - 500 068.
bptechindiapvtltd@gmail.com
www.bptechllc.in
+91 70955 35566



రిపోర్టర్స్ కావలెను
V3 NEWS
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108


Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com